హైదరాబాద్ వార్త



# పెట్రోల్‌బంకుల్లో కనీస సేవలు నిల్

**మౌలిక సౌకర్యాల కల్పనలో నిర్వాహకుల నిర్లక్ష్యం**

**కనిపించని కొలమానాలు.. బాత్రూమ్‌లకుతాళాలు**

**వాహనాల్లో గాలినింపితే.. డబ్బు చెల్లించాల్సిందే**

**మెజార్టీ బంకుల్లో ధరల డిస్‌ప్లే లేదు**

**సౌకర్యాలపై దృష్టి సారించని సంబంధిత అధికారులు**



హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త: పెట్రోల్ పోయడం డబ్బులు తీసుకోవడం.. తప్ప వినియోగదారులకు అందాల్సిన కనీస సేవలను బంకుల నిర్వాహకులు అందించడం లేదు. వాహనాలకు ఉచితంగా గాలి నింపాల్సి ఉన్నా.. కొన్నిచోట్ల డబ్బులు వసూలు చేస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో ఎయిర్ పంపులే లేవు. నగరంలోని ఎల్బీనగర్ ప్రాంతంలో ఉన్న పౌర సరఫరాలశాఖ పెట్రోల్‌బంకుకు నిత్యం వందలాది వాహనాలు వస్తాయి. ఇక్కడ పెట్రోల్, డీజీల్ పోయించుకోవాలంటే కనీసం 15నిమిషాలు వేచి ఉండాల్సిందే.. ఈబంకుల్లో వాహనదారులు తాగేందుకు నీళ్లుండవు.. వాహనానికి గాలి పెట్టుకోవడానికి ఎయిర్‌పంపు ఉండదు. కనీసం బైక్‌టైర్లలో గాలినింపాలన్నా డబ్బు చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వ పౌరసరఫరాలశాఖకు చెందిన బంకుతీరు ఈవిధంగా ఉంటే ఇతర ప్రైవేట్ పెట్రోల్ బంకుల్లో తీరు ఇంకా అద్వానంగా ఉంది. పెట్రోల్,డీజిల్ అమ్మకాలపైనే దృష్టి సారించిన నిర్వాహకులు వాహనాదారులకు ఎలాంటి సౌకర్యాలు అందించడం లేదు. గ్రేటర్‌లోని హైదరాబాద్,రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో కలిపి560కిపైగా పెట్రోల్ బంకులు ఉండగా వాటిలో నిత్యం వేలసంఖ్యలో పెట్రోల్, డీజిల్ అమ్ముడుపోతుంది. నగరంలో బైకులు,కార్లు, లారీలు, బస్సులు, ఆటోలు, జీపులు, ఇతరత్రా కలిసి 60లక్షలకు పైగా వాహనాలు ఉన్నాయి.

**బంకుల్లో ధరల డిస్‌ప్లే లేదు..** వనస్థలిపురం విజయవాడ రహదారి, హస్తి నాపురం సాగర్ రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన పలు పెట్రోల్ కంపెనీలకు చెందిన పంపులు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయి. పెట్రోల్,డీజిల్ హెచ్చుతగ్గుల్ని ఎక్కడా డిస్‌ప్లే చేయడం లేదు. వనస్థలిపురం రైతుబజార్ సమీపంలోని పెట్రోల్‌బంకుల్లో తాగునీటి సౌకర్యం లేకపోవడమే కాకుండా వాహనాలకు గాలినింపి డబ్బులు వసూలు చేస్తున్నారు. కొన్నిచోట్ల గాలినింపే యంత్రాలు పనిచేయడం లేదు. ఉచితమని బోర్డులకు మాత్ర మే పరిమితం. డెన్సిటీ మీటర్లు, ఫిల్టర్ సెట్టింగ్,కల్తీ పరిశీలించేందుకు టెంపరేచర్ రికార్డర్స్ అందుబాటులో లేవు. సిబ్బందికి మాత్రమే మరుగుదొడ్లు అందుబాటులోఉంచి బంక్‌ల యాజమాన్యాలు వాహనదారుల మౌలిక అవస రాలను గాలికొదిలారు. హాయత్‌నగర్ విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న పలుపెట్రోల్ బంకుల్లో టాయిలెట్స్ ఉన్నప్పటికీ అవి అపరిశుభ్రంగా ఉన్నాయి.

**కనింపించని కొలమానాలు..** పెట్రోల్ బంకుల్లో ఇంధన నాణ్యత పరిశీలన అందుబాటులోకి లేకుండా పోయింది. ఇంధనం నాణ్యతను పరిక్షించే అధికారం వినియోగదారులకు ఉంటుంది. అదుంకు సంబోధించిన కిట్‌ను కోరినప్పుడు బంక్ సిబ్బంది అందించాలి. ఫిల్టర్ పేపర్‌పై ఒక్కచుక్క ఇంధనం వేస్తే పది సెకన్లలో ఆవిరైపోతుంది. ఆరిన తర్వాత కనిపిస్తే కల్తీ జరిగినట్లు గ్రహించాలి. హైడ్రోమీటర్ల ద్వారా కూడా నాణ్యతను తెలుసుకోవచ్చు. ఇందుకు బంకుల్లో హైడ్రోమీటర్, ఫిల్టర్ పేపర్ ఐదులీటర్ల క్యాన్ అందుబాటులో ఉంచాలి.

## బండ్లగూడ జాగీర్ కాళీమందిర్ వద్ద ఆర్టీసి బస్సు బీభత్సం

➤ రెండు కార్లు, బైక్ ధ్వంసం

➤ తృటిలో తప్పిన ప్రాణాపాయం



కాళిమందిర్ చౌరస్తాలో బీభత్సం సృష్టించిన ఆర్టీసి బస్సు

నార్సింగి, మే 25 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని కాళీమందిర్ చౌరస్తాలో ఆర్టీసి బస్సు భీబత్సం సృష్టించింది. ఈ సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ముషీరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసి బస్సు(ఎపి11జడ్ 7015)ను గురువారం డ్రైవర్ కృష్ణ రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ నుంచి మెహిదీపట్నం-కోఠి వైపుకు నడుపుతున్నాడు. బండ్లగూడ కాళీమందిర్ బస్టాపు సమీపంలోకి రాగానే వేగం అదుపు తప్పి పార్కింగ్ చేసిన వాహనాలను ఢీకొడుతూ వెళ్లాడు. ఆగి ఉన్న లారీ వలన బస్టాపులో ఉన్న ప్రయాణీకులు ప్రాణాలతో బయట పడ్డారు. లారీ లేకుంటే పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరిగి ఉండేది. ఈ సంఘటనలో ఓ బైకు(ఎపి28ఎజడ్ 4199), ఓ కారు (టిఎస్03ఇఇ 9093) పూర్తిగా ధ్వంసం అవ్వగా మరో కారు (టిఎస్07 ఇఎన్ 0963)కు సైతం అద్దాలు, టైర్లు, డోర్లు పగిలిపోయాయి. దీంతో బస్టాపులో నిల్చున్న ప్రజలంతా పరుగులు పెట్టారు. ఆర్టీసి బస్సులోని ప్రయాణీకులు ఇద్దరు ముగ్గురికి గదువ, తల భాగాలాలలో స్వల్ప గాయాలయ్యాయి. తృటిలో అక్కడున్న ప్రజలు ప్రాణాలతో బయట పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆర్టీసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నార్సింగి పోలీసులు వివరించారు.

## కళావేదికలుగా పాఠశాలలను తీర్చిదిద్దాలి



బాలసాహితీవేత్తకు పరిషత్తు కిట్‌ను అందజేస్తున్న శివారెడ్డి, చెన్నయ్యలు

నాంపల్లి, మే 25 ప్రభాతవార్త : తెలంగాణ సారస్వత పరిషత్తు 80 వసంతోత్సవాలను పురస్కరించుకొని పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళా మందిరంలో నిర్వహిస్తున్న రెండురోజుల బాలసాహిత్య సమ్మేళనం రెండవరోజు గురువారం విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని, ప్రతిభాపాటవాలను వెలికితీయడం కోసం పాఠశాలలను కళావేదికలుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఉభయ తెలుగురాష్ట్రాల్లోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విన్నవిస్తూ సమ్మేళనం ఏకగ్రీవంగా తీర్మానించింది. పాఠశాలల్లోని తెలుగు ఉపాధ్యాయులు స్థానికంగా ఉన్న కవి, రచయితల సేవలను ఇందుకు వినియోగించుకోవాలని కోరారు. పిల్లలను పాఠశాల స్థాయిలోనే కళాకారులు, రచయితలుగా తయారుచేయొచ్చని అభిప్రాయపడ్డారు. పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన, ప్రధాన కార్యదర్శి డా. జె.చెన్నయ్య నిర్వహణలో ఉదయం నుండి సాయంత్రం వరకు జరిగిన వివిధ సదస్సుల్లో బాలరచయితలు, రచయిత్రులు, బాల సాహితీవేత్తలు, తెలుగు ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సంగీత, నృత్య, నాటక, చిత్రలేఖన, శిల్పకళల గురించి పరిచడం చేసేందుకు డా. వడ్డేపల్లికృష్ణ అధ్యక్షతన జరిగిన సదస్సులో ప్రముఖ విద్వాంసులు కలగా కృష్ణమోహన్, కళాకృష్ణ, డా. జె.విజయ్‌కుమార్జీ, జె.వెంకటేశ్వర్లు ఆసక్తికరంగా ప్రసంగించారు. డా. వెల్లండ నిత్యానందరావు అధ్యక్షతన పాఠశాలల బాలసాహిత్య వికాస కేంద్రాలు అనే అంశంపై జరిగిన చర్చాగోష్ఠిలో తెలంగాణ, ఏపిల నుండి 25మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మధ్యాహ్నం సురేష్ అధ్యక్షతన జరిగిన బాల రచయితల ఇష్టాగోష్ఠిలో 20మందికిపైగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాల రచయితలు, రచయిత్రులు పాల్గొని తమ అనుభవాలను వివరించారు. అనంతరం జరిగిన సమాపనోత్సవంలో ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ డా. కె.ఐ.వరప్రసాదరెడ్డి సౌజన్యంతో నిర్వహించిన బాలసాహిత్య సమ్మేళనం ఫలవంతం, విజయవంతంగా జరిగిందని సంతృప్తి వ్యక్తం చేశారు. మణికొండ వేదకుమార్, వసుంధర, డా. సురవరం కృష్ణవర్ధన్‌రెడ్డి, తురగా ఉషారమణి, గరిపెల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు. చివరిగా బాల సాహితీవేత్తలకు పరిషత్తు ప్రత్యేకంగా తయారు చేసిన పుస్తకాలతో కూడిన కిట్‌ను అందజేశారు.

### 'కూచిపూడి నృత్య సంగీతం'పై ప్రత్యేక కార్యక్రమం

చిక్కడపల్లి, మే 25 ప్రభాతవార్త: ప్రముఖ సాంస్కృతిక సంస్థ 'నవ్యనాటక సమితి' 65వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'భారతీయ శాస్త్రీయ నృత్య, సంగీతరీతుల ప్రసంగ పరంపర' లో భాగంగా 'కూచిపూడి నృత్య సంగీతం'పై ప్రత్యేక కార్యక్రమాన్ని 27న నగరంలోని సుల్తాన్‌బజార్ శ్రీకృష్ణదేవరాయ భాషానిలయంలో నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, సమన్వయకర్త నిష్టల సుధామాల వివరించారు సమితి కార్యాలయంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రత్యేక పోస్టర్‌ను రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉపసంచాలకులు జి.వసుంధర ఆవిష్కరించారు. సుధామాల మాట్లాడుతఊూ కేంద్రీయ విశ్వవిద్యాలయం నృత్యవిభాగం గాయకులు డిఎస్‌వి.శాస్త్రి 'నృత్య సంగీతంపై' ప్రసంగిస్తారని, ముఖ్యఅతిథిగా ప్రముఖ సంగీత విద్వాంసులు వి.ఆనంద్‌మోహన్, గౌరవ అతిథులుగా ప్రముఖ నృత్యగురువులు కళాకృష్ణ, భాగవతుల సేతురామ్ పాల్గొంటారన్నారు. వసుంధర మాట్లాడుతూ నాట్యానికి సంగీతం ప్రాణమని, నృత్యానికి భావయుక్తంగా, శాస్త్రీయబాణిలో పాటపడాల్సి ఉంటుందన్నారు. వివిధ భావాలను గాయకులు తమ గొంతుతో పలికించాలని వివరించారు.

## న్యాయపోరాటంలో కుటుంబవేదనే ముసుగు సాంఘిక నాటకం



ముసుగు నాటకంలో ఓ దృశ్యం

రవీంద్రభారతి, మే 25 ప్రభాతవార్త : అన్యాయానికిలోనై చేయని నేరానికి బలై శిక్ష అనుభవిస్తూ కాలగర్భంలో కలిసిపోవాల్సిందేనా... మోపబడ్డ కేసులు కోర్టు ప్రక్రియల్లో సంవత్సరాల తరబడి తాత్సారం జరిగి సత్యం మరుగున పడిపోతుంటే.. చట్టాల్లో మార్పుతేవాలి... నేరం జరిగిన వెంటనే సత్వరన్యాయం జరిగి త్వరిగతిన శిక్ష అమలు కావాలని అభ్యర్థించే ఒక దీన కుటుంబ ఆవేదనే ముసుగు సాంఘిక నాటకం. ప్రతీనెలా నాటకం-ప్రేక్షకుడికి వినోదం, నటుడికి ఆనందం-అదే మాబాట, మామాట అంటూ ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసరంజని ఆధ్వర్యంలో ప్రదర్శింపబడుతున్న నాటకాన్ని టిక్కెట్ కొనిచూసే అలవాటును ప్రేక్షకుల్లో కలిగిస్తూ ప్రతీనెల జరిపే నాటక ప్రదర్శనలో భాగంగా రవీంద్రభారతి ప్రధాన మందిరంలో గురువారం రాత్రి 6.30గంటలకు హార్షక్రియేషన్స్ విజయవాడ వారి సమర్పణ, విన్నకోట గంగా శివకుమార్ రచన, కత్తి శ్యాంప్రసాద్ దర్శకత్వంలో నటీనటులు సోమిశెట్టి అమృతవర్షిణి జేజమ్మగా, గుడివాడ లహరి భారతి/ ఎస్‌ఐ లహరిగా, ఎర్రా అంజలి సరస్వతిగా, కత్తి శ్యాంప్రసాద్ ప్రకాష్‌గా, ఎస్.కె.డి.హాసన్ వినయ్‌కుమార్‌గా, ఈవెన రమేష్‌బాబు బ్రహ్మయ్యగా, యజ్జల శేషుపవన్‌కుమార్ సూరిగా, బలివాడ మల్లేశ్వర పట్నాయక్ పేషెంట్/ కానిస్టేబుల్‌గా తమతమ పాత్రల్లో అద్భుత నటనతో రూపొందిన ముసుగు సాంఘిక నాటకం అద్భుతంగా ప్రదర్శింపబడి అధికసంఖ్యలో విచ్చేసిన రంగస్థల నాటకప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులను ఆలోచింపజేసి చైతన్యాన్ని రేకెత్తించి కనువిప్పు కలిగించిందనడంలో సందేహం లేదు. ప్రదర్శనానంతరం కళాకారులను అతిథుల చేతులమీదుగా ఘనంగా సన్మానించారు.

## మత్స్యకారుల అభ్యున్నతికై ఎనలేని సేవలు అందించిన మహనీయుడు ఏ.ఎల్.మల్లయ్య

**బీసీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్**



ఏ.ఎల్.మల్లయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వకుళాభరణం కృష్ణ మోహన్

ధర్నాచౌక్, మే 25, ప్రభాతవార్త: మత్స్యకారుల అభ్యున్నతికై ఎనలేని సేవలు అందించిన మహనీయుడు ఏ.ఎల్ మల్లయ్య అని రాష్ట్ర బీసీ కమీషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ కొనియాడారు. గురువారం తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం మాజీ అధ్యక్షులు, ఫిషరీస్ మాజీ ఛైర్మన్ ఏ.ఎల్.మల్లయ్య జయంతి సందర్భంగా లోయర్‌ట్యాంక్‌బండ్ లోని సంఘం కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ఏ.ఎల్. మల్లయ్య విగ్రహాన్ని ఆయన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్కతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ.ఎల్.మల్లయ్య జీవించినంతకాలం బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధనకోసం శ్రమించారని గుర్తు చేశారు. అన్ని వర్గాల ప్రజల గుండెలలో ఆయన చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు. అరవై సంవత్సరాలపాటు మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం పాటుపడిన వ్యక్తి ఏ.ఎల్.మల్లయ్య అని, ఆయన పోరాటాల ఫలితంగానే ప్రభుత్వాలు మత్స్యకారుల అభివృద్ధికై ఎన్నో ఉత్తర్వులు, పథకాలు అమలుచేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం అధ్యక్షులు గడపశ్రీహరి, మల్కాజ్‌గిరి కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీధర్, గంగతెప్పోత్సవ కమిటీ అధ్యక్షులు ఎం.మహేందర్, సంఘం ప్రతినిధులు గూడబోయిన శివరత్నం, చంద్ర ప్రకాష్, బాలయ్య, ఎర్రబోయిన మల్లేష్, మాజీ కార్పోరేటర్ మెట్టు వైకుంఠం, సంఘం యువ నాయకుడు అంబటి సుధాకర్, శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## బాలిక మృతికి కారు డ్రైవర్ నిర్లక్ష్యమే..

**కారు నడిపిన వ్యక్తిపై కేసు నమోదు**



బాలికపైకి దూసుకువస్తున్న కారు (సీసీకెమెరాలో నమోదైన దృశ్యం)

హయత్‌నగర్, మే 25 ప్రభాతవార్త: హయత్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం జరిగిన కారు ప్రమాదంలో మూడేళ్ల బాలిక మృతిచెందిన విషయం తెలిసిందే. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని వాహనం తలపై నుంచి వెళ్లడంతో బాలిక మృతి చెందినట్లుగా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పోలీసులు అపార్టు మెంట్‌లోని సీసీ కెమెరాల ను పరిశీలించగా.. అపార్టుమెంట్‌లో ఉండే ఎక్సైజ్ ఎస్సై భర్త హరిరామకృష్ణ నిర్లక్ష్యంగా కారు నడిపడమే ప్రమాదానికి కారణమని నిర్ధారించారు. అపార్టుమెంట్ సెల్లార్‌లో వారికి కేటాయించిన పార్కింగ్ స్థలంలో బాలికను పడుకోబెట్టడం దానిని గమనించని హరిరామకృష్ణ నేరుగా తల మీదుగా కారును నడిపించడంతో బాలిక మృతిచెందినట్లుగా తెలుసుకున్నారు. ఈమేరకు పోలీసులు హరిరామకృష్ణపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రేవంత్‌రెడ్డి భేషరతుగా క్షమాపణ చెప్పాలి

**యాదవ, కురుమ జేసీ నాయకుల డిమాండ్**



నిరసన తెలుపుతున్న యాదవ, కురుమ జేసీ నేతలు

ధర్నాచౌక్, మే 25, ప్రభాతవార్త: యాదవ కులాన్ని అవమానిస్తూ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని యాదవ, కురుమ జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. గురువారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ యాదవ, కురుమ జేఏసీ ఆధ్వర్యంలో సాంప్రదాయ డోలు చప్పుళ్లు, దున్నపోతుల విన్యాసాలతో పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొల్ల కురుమల వృత్తిని, యాదవుల ముద్దుబిడ్డ తలసాని శ్రీనివాసయాదవ్‌ను అవమానించే విధంగా రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారని ఆరోపించారు. రాహుల్‌గాంధీ వ్యాఖ్యలకు ఆయనను ఏవిధంగా సస్పెండ్ చేశారో అదే విధంగా రేవంత్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలు దగ్ధం చేయటం, రాస్తారోకోలు నిర్వహించటం జరిగిందని తెలిపారు. వెనుకబడిన వర్గానికి చెందిన మంత్రిపై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అగ్రకుల అహంకారానికి నిదర్శనమని, దీనిని కాంగ్రెస్ పార్టీ నేతలు కూడా ఖండించాలని అన్నారు. తక్షణమే రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని లేనిపక్షం గాంధీభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం ఛలో గాంధీభవన్ పేరుతో బయల్దేరిని నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ నిరసన కార్యక్రమంలో యాదవ, కురుమ జేఏసీ నేతలు రాజారాం యాదవ్, గోవర్ధన్ యాదవ్, మేకల రాములు యాదవ్, శ్రీహరి యాదవ్, ఎక్కాల కన్నా కురుమ, కడారి అంజయ్య యాదవ్, మల్లేష్ కురుమ, పుష్పనగేష్ కురుమ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలకు కృషి

చిక్కడపల్లి, మే 25 ప్రభాతవార్త: రాష్ట్రంలో సంఘటిత, అసంఘటితరంగ కార్మికులకు సంబంధించిన కనీస వేతనాలు అమలు చేయడానికి తనవంతు కృషి చేస్తానని తెలంగాణ కనీస వేతన సలహా మండలి ఛైర్మన్‌గా నియమితులైన పులిమామిడి నారాయణ అన్నారు. రెండు మూడు రోజుల్లో తాను ఛైర్మన్‌గా బాధ్యతలను స్వీకరిస్తానని, మండలి ఛైర్మన్‌గా నియమితులైన సందర్భంగా గురువారం బాగ్‌లింగంపల్లి బిఆర్‌టియు రాష్ట్ర కార్యాలయంలో 'ప్రభాతవార్త'తో మాట్లాడారు. అంతకుముందు ఛైర్మన్‌గా నియమితులైన సందర్భంగా మంత్రి మల్లారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబుయాదవ్ కూడా ఉన్నారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర హోంమంత్రి మహమూద్ ఆలీ, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సి.మల్లారెడ్డి, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## చేపప్రసాదం పంపిణీకి పటిష్టమైన ఏర్పాటు చేయండి

**అధికారులను ఆదేశించిన మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త: చేపమందు పంపిణీకి పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని వివిధ శాఖల అధికారులను మంత్రి శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. ఈమేరకు గురువారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లోని కార్యాలయంలోని సమావేశ మందిరంలో చేపప్రసాదం పంపిణీపై బత్తిని కుటింబికులతోపాటు వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వారం రోజుల ముందునుంచే ఎక్సిబిషన్‌గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తెలుగు రాష్ట్రాలలో వివిధ జిల్లాలతోపాటు దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి కూడా లక్షలాదిగా ఆస్తమా ,ఉబ్బసం వ్యాధిగ్రస్తులు తరలి వస్తారన్నారు. కాబట్టి ప్రజలకు ఏవిధంగా అసౌకర్యానికి తావులేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. చేపప్రసాదం పంపిణీ కొరకు బత్తిని కుటుంబికులు వారి కుటుంబ సభ్యులు 200మందికి ప్రత్యేక గుర్తింపు కార్డులు అందచేస్తున్నామన్నారు. స్తామా ,ఉబ్బసం వ్యాధి గ్రస్తులుకు సరపడా చేపప్రసాదాన్ని తయారు చేసుకోవాలని బత్తిని కుటుంబికులకు సూచించడంతోపాటు అందుకు సరిపడా కొరమీను చేప పిల్లలను సిద్ధం చేయాల్సిందిగా మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే రాజాసింగ్,రహమతుల్లా బేగ్, కార్పొరేటర్ శంకర్‌యాదవ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎంసెట్‌లో ర్యాంక్‌రాలేదని విద్యార్థి ఆత్మహత్య



మృతి చెందిన శ్రీకృష్ణ చైతన్య (ఫైల్)

తార్నాక, మే 25 ప్రభాతవార్త: ఎంసెట్‌లో తక్కువ మార్కులు వచ్చాయని ఆందోళన చెందిన ఓ విద్యార్థి ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషాదకర సంఘటన గురువారం ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్‌పెక్టర్ జె.భాస్కర్ కథనం ప్రకారం. న్యూ నల్ల కుంటకు చెందిన కెఎల్ఎన్ శర్మకు ఇద్దరు అమ్మాయిలు ఒక కుమారుడు ఉన్నా రు. ఇదిలా ఉండగా చిన్నకుమారుడైన కూనపులి శ్రీ కృష్ణ చైతన్య(18) అంబర్‌పేట్‌లోని శ్రీచైతన్య జూనియర్ కాలేజ్‌లో ఎంపీసీ ఇంటర్ చదివాడు. ఇదిలా ఉండగా గురువారం వెలువడిన ఎంసెట్ ఫలితాల్లో చైతన్యకు 39 మార్కులు వచ్చాయి. దీంతో అతను తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఇంట్లో ఎవరికి చెప్పకుండా తన సైకిల్‌పై ఉస్మానియా యూనివర్సిటీకి చేరుకున్నాడు. మద్యాహ్నం మృతుడు ఠాగూర్ ఆడిటోరియం వద్ద ఉన్న చెట్లపొదల్లోకి వెళ్లి తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నాడు. దీంతో మంటల బాదను తట్టుకోలేక కేకలు వేస్తూ రోడ్డుపైకి వచ్చాడు. అదేసమయంలో ఓ.యూలో పనిచేసే పంప్ ఆపరేటర్ మహేష్ ఈ దృశ్యాన్ని చూసి భయాందోళనకు గురై వెంటనే పోలీసులకు సమాచారం అందిం చారు. దీంతో విషయం తెలుసుకున్న ఇన్స్‌పెక్టర్ భాస్కర్, ఎస్సైలు లక్ష్మినారాయణ, శాంతకుమార్ నోవా ఘటనాస్థలానికి చేరుకొని 108 సహాయంతో గాంధీ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా కాలిన గాయాలతో చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా గాంధీభవన్‌ను ముట్టడించడానికి గురువారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ నుంచి బయలుదేరిన వివిధ జిల్లాలకు చెందిన కురుమ, యాదవ సంఘం నాయకులను అడ్డుకున్న పోలీసులు

## కాంట్రాక్ట్ కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న ఎం.నర్సింహా

సైఫాబాద్, మే 25 ప్రభాతవార్త: జిహెచ్ఎంసి ఎన్నికల్లో గత కొన్ని సంవత్సరాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న అర్బన్ మలేరియా సిబ్బంది సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వెంటనే క్రమబద్ధీకరించాలని, వారికి వేతనాలు ప్రభుత్వమే చెల్లించాలని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహా డిమాండ్ చేశారు. హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో గురువారం జరిగిన జిహెచ్ఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని గత కొన్ని సంవత్సరాలుగా ప్రకటించిందని, కాని మలేరియా స్కిమ్‌లో పనిచేస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేయకుండా సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు తమారు చేసి కార్మిక చట్టాలను వర్తించకుండా చేసేందుకు జిహెచ్ఎంసి అధికారులు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చపడతామని ఆయన హెచ్చరించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.వెంకటయ్య మాట్లాడుతూ కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బోడ్డుపల్లి కిషన్, కోశాధికారి కోండల్, నాయకులు నరేందర్‌రెడ్డి, అజయ్, రాజశేఖర్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించిన కార్పొరేటర్



అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

మూసాపేట, మే 25, ప్రభాతవార్త : 124 డివిజన్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ ఫేస్ 1 వాటర్ ట్యాంకర్ ఎదురుగా 20లక్షల రూపాయలతో అలాగే పాపమ్మబస్తీ నుండి చంద్రమ్మ కాలనీ వరకు 12.5లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం స్థానిక డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ వెంకటేష్, ఏఈ శ్రావణి, వర్క్‌ఇన్స్‌పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో టిడిపికి పూర్వ వైభవం తెస్తాం: ముప్పిడి గోపాల్



టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను సన్మానిస్తున్న అధికారి ముప్పిడి గోపాల్ తదితరులు

అడ్డగుట్ట, మే 25 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో టిడిపిని మరింత బలోపేతం చేసి పూర్వ వైభవం తెచ్చేందుకు ఛాయశక్తుల కృషి చేస్తామని తెలంగాణ రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి ముప్పిడి గోపాల్ పిలుపునిచ్చారు. టిడిపి రాష్ట్ర నూతన కార్యవర్గంలో మరో 28 మందికి చోటు కల్పించగా కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన ముప్పిడి గోపాల్‌ను అధికార ప్రతినిధిగా నియమించినందుకు గురువారం ఆయనతో పాటు మరి కొంత మంది టిడిపి నాయకులు రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌కు శాలువకప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ముప్పిడి గోపాల్ మాట్లాడుతూ కాసాని నేతృత్వంలో రాష్ట్రంలో టిడిపిని మరింత బలోపేతం చేసేందుకు సమిష్టిగా కృషి చేస్తామన్నారు.

## కంటి చూపుతోనే ప్రపంచాన్ని చూడగలం



కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మహాలక్ష్మీరామన్‌గౌడ్

హైదరాబాద్, మే 25 ప్రభాతవార్త: కంటి చూపుతోనే ప్రపంచాన్ని చూడగలుగుతామని, నేత్రాలను జాగ్రత్తగా కాపాడుకోవాలని హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కంటిచూపు లేకపోతే అంధకారంలో జీవితం గడపటం ఎంతో దుర్భరంగా ఉంటుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం డివిజన్‌లోని గౌడ హాస్టల్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

## కేంద్రం ఉచిత విద్య, వైద్యం అందించాలని నేడు నిరాహార దీక్ష

సైఫాబాద్, మే 25 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను దేశవ్యాప్తంగా అమలు చేయాలని, ఉచిత విద్య, వైద్యం అందించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ధర్నా చౌక్ వద్ద నిరాహార దీక్ష చేపడుతున్నామని సమాచార హక్కు పరిరక్షణ సమితి తెలిపింది. ఈ మేరకు గురువారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి జాతీయ ఛైర్మన్ డా. బొమ్మర బోయిన కేశవులు, కన్నెబోయిన ఉషారాణి మాట్లాడుతూ ఈ దీక్షా శిబిరంలో ముఖ్య అతిధులుగా రాష్ట్ర మంత్రులు మహమూద్‌అలీ, జి.జగదీశ్వర్‌రెడ్డి, వి.శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, శాసన మండలి డిప్యూటి ఛైర్మన్ బండ ప్రకాశ్ తదితరులు పాల్గొంటారని చెప్పారు.

## చెస్ క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

శాట్స్ ఛైర్మన్ ఆంజనేయగౌడ్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఛైర్మన్ ఆంజనేయగౌడ్, చంద్రమౌళి, నవీన్, నరేష్ తదితరులు

హైదరాబాద్, మే 25,ప్రభాతవార్త: మేధో వికాసానికి ,బుద్ధికుశలతకు దోహదం చేసే చదరంగం క్రీడాంశానికి తెలంగాణ ప్రభుత్వం "శాట్స్" ద్వారా ఎంతో ప్రోత్సాహం ఇస్తోందని శాట్స్ ఛైర్మన్ ఆంజనేయగౌడ్ అన్నారు. ఈమేరకు గురువారం తెలంగాణ చెస్ అసోసియేషన్, స్పోర్ట్ లోకల్ ఏరియా నెట్‌వర్క్ ఆధ్వర్యంలో జూలై 21నుంచి 25 వరకు హైదరాబాద్ లో నిర్వహించనున్న అంతర్జాతీయ ఫిడే చెస్ టోర్నమెంట్ వాల్‌పోస్టర్‌ను నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆంజనేయగౌడ్ మాట్లాడుతూ సిఎం కెసిఆర్ రాష్ట్రంలో అన్ని రంగాల మాదిరిగానే గత దశాబ్ది కాలం నుంచి క్రీడారంగాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేశారని, చెస్ క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహిస్తున్నార న్నారు. ఉప్పల ప్రవీణ్, నందిత వీర్లపల్లి లాంటి ఔత్సాహిక చెస్ క్రీడాకారులకు ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలు అందించారని ఆయన గుర్తుచేశారు. వివిధ క్రీడా సంఘాలు నిర్వహించే టోర్నమెంట్ విజయవంతం కావడానికి శాట్స్ తరపున పూర్తిగా సహాయసహకారాలు అందిస్తామని తెలిపారు. చెస్ అసోసియేషన్ ప్రతినిధులు చంద్రమౌళి, నవీన్‌నాయక్, నరేష్ పాల్గొన్నారు.

# జంట జలాశయాలను పరిరక్షించాలి



జలాశయాల సంరక్షణ, 111 జీవో రద్దు అంశాల సదస్సులో ప్రసంగిస్తున్న తెలంగాణ సోషల్ మీడియా ఫోరం అధ్యక్షుడు కర్ణకర్ దేశాయ్

కంటోన్మెంట్, మే 25 ప్రభాతవార్త: తెలంగాణ జలాశయాలను సంరక్షించేందుకు, జంట నగరాలను కాపాడేందుకు, 111 జీవోను రద్దు చేసేందుకు సంఘటితంగా ఉద్యమించాలని తెలంగాణ సోషల్ మీడియాఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కర్ణకర్ దేశాయ్, ప్రొఫెసర్లు పురుషోత్తం రెడ్డి, దొంతి నర్సింహ్మారెడ్డి, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరిలు పిలుపునిచ్చారు. గురువారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని గురుస్వామి హాల్‌లో నిర్వహించిన సదస్సుకు వారు ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. 111 జీవో పరిధిలోని 84 గ్రామాల్లో ప్రజా సంఘాలతో పర్యటించి శ్వేత పత్రాలను విడుదల చేయాలన్నారు. హుస్మాన్ సాగర్ జంట జలాశయాలను వరసత్వ సంపదగా గుర్తించాలన్నారు. జంట జలాశయాల పరివాహక ప్రాంతంలో బహుజన బతుకమ్మ ఉత్సవాలకు నాంది పలుకుతూ 84 గ్రామాల్లో నివాసం ఉంటున్న పేద, దళిత కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలన్నారు. పరివాహక ప్రాంతాల చుట్టుప్రక్కల ఉన్న భూములపై వినియోగ సర్వే చేయించాలన్నారు. 2016లో నిర్వహించిన సామాజిక సర్వే ఫలితాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జంట జలాశయాలు నీటి వనరులతో కూడిన చెరువును కాపాడేందుకు చర్యలు తీసుకొని వాటి సంరక్షణకు నిధులు విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాదులు నాగుల శ్రీనివాస్‌యాదవ్, రచనా రెడ్డి, ఇంజనీరింగ్ పట్టభద్రుల సంఘం నేత పిట్ల నాగేశ్, మాజీ ఐఏఎస్‌అధికారి అఖునూరి మురళీ, సంఘం ప్రతినిధులు సురేందర్, రవి, అనురాధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాంపల్లి రైల్వేస్టేషన్ పార్సల్‌యార్డ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి

నాంపల్లి, మే 25 ప్రభాతవార్త : నాంపల్లి జీఆర్‌పి పరిధిలోని నాంపల్లి రైల్వేస్టేషన్ పార్సిల్స్ స్లైడింగ్‌యార్డు వద్ద ఒక గుర్తుతెలియని వ్యక్తి బుధవారం సాయంత్రం మృతిచెందాడు. హైదరాబాద్ జీఆర్‌పి హెడ్‌కానిస్టేబుల్ ఆర్.శ్రీనివాసులు తెలిపిన వివరాల్లోకి వెళితే గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న గుర్తుతెలియని వ్యక్తి ఎండవేడిమికి తట్టుకోలేక మరణించి ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి వయస్సు 40-45 సంవత్సరాలు, ఎత్తు 5.6అడుగులు, కోలముఖం. మెరూన్‌కలర్ గడులున్న ఫుల్‌షర్టు, కాఫీకలర్ డ్రాయర్, సిమెంట్ కలర్ ప్యాంటు ధరించి ఉన్నారు. మృతదేహానికి పంచనామాచేసి పోస్టుమార్టం అనంతరం ప్రభుత్వ ఉస్మానియా ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పూర్తి వివరాల కోసం జీఆర్‌పి నాంపల్లి రైల్వే పోలీసుస్టేషన్ నంబరు 040-23202238 లేదా హెడ్‌కానిస్టేబుల్ ఆర్.శ్రీనివాసులు మొబైల్ నంబరు 9848343544లో సంప్రదించవచ్చునని తెలిపారు.

## 111 జీవో రద్దుతో అభివృద్ధి కాదు.. విధ్వంసమే..

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ

హైదరాబాద్, మే 25,ప్రభాతవార్త: గండిపేట్ -హిమాయత్‌సాగర్ జంట జలాశయాల పరిరక్షణ కోసం అప్పటి ప్రభుత్వం తెచ్చిన జీవో 111 ఎత్తివేతతో అభివృద్ధి ఏమీ జరగడం లేదని కానీ విధ్వసం జరగుతుందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ ఆరోపించారు అనంతరగిరి కొండల నుంచి రెండు సరస్సులకు నీరు వచ్చే సహజ వ్యవస్థను ప్రభుత్వం విచ్ఛిన్నం చేయడం తప్పా మరొకటి కాదని తెలిపారు. ఈమేరకు గురువారం కాచిగూడలోని ఓహోటల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమెమాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి తాగునీటి వనరులైన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ సరస్సులను వాటి పరివాహన ప్రాంతాలను జీవో 111 రక్షిస్తుందని, ఈజీవో రద్దుతో వర్షాలు కురిసే సమయంలో భారీ నీరు పొంగి,హైదరాబాద్ నగరానికి వరదల ముప్పు ఏర్పడుతుందన్నారు. ఈజీవోను సమర్థిస్తూ 2000 సంవత్సరంలో సుప్రీంకోర్టు సూపర్ ఆర్డర్ ఇచ్చిందని రాష్ట్ర ప్రభుత్వం దాన్ని ఎలా దిక్కరిస్తుందని ప్రశ్నించారు. ఇప్పటికే మూసి నది కాపాడలేని దుస్థితి రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్న ఆమె అధికారపార్టీ నేతల అండతో భూఆక్రమణదారులు రెచ్చిపోయి పేదల నుంచి బలవం తంగా భూములను లాకుంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో 111 రద్దును తక్షణమే ఉపసంహారించుకోవాలని లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అలాగే కోర్టులో కూడా 111 జీవో రక్షణకై న్యాయ పోరాటం చేస్తామని కోట నీలిమ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## సిఎం కప్-2023లో సత్తా చాటిన క్రీడాకారులకు అభినందనలు



సిఎం కప్-2023లో సత్తా చాటిన వాలీబాల్ క్రీడాకారులను అభినందించిన మేయర్ మహేందర్‌గౌడ్

నార్సింగి, మే 25 ప్రభాతవార్త : సరూర్ నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన సీ ఎం కప్ - 2 0 2 3 లో సత్తా చాటిన బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ క్రీడాకారులు సత్తా చాటారు. వాలీబాల్ క్రీడలో జిల్లా స్థాయిలో తలబడిన క్రీడాకారులు ద్వితీయ స్థానంను కైవసం చేసుకొని నిర్వాహకులతో శభాష్ అనిపించుకున్నారు. కప్ సాధించి వచ్చిన క్రీడాకారులను గురువారం బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ కార్యాలయంలో మేయర్ మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డిలు ఘనంగా సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్య సాధనతోనే గెలుపు సాధ్యపడుతుందన్నారు. క్రీడాకారులు తమ సత్తాతో బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌కు జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు తీసుకు వచ్చారని సంతోషాన్ని వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరింత సాధన చేసి రాష్ట్రస్థాయి పోటీలలో సైతం రాణించాలని, ఇందుకు మా కార్పోరేషన్ తరపున మీకు వాలీబాల్ ఆట సాధనకు అవసరమైన అన్ని రకాల సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ వేణుగోపాల్‌రెడ్డి, పలువురు కార్పోరేటర్లు, కార్పోరేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హిందూ శ్మశానవాటిక ప్రహరీ గోడ నిర్మాణ పనులు ప్రారంభం



భూమిపూజా కార్యక్రమంలో స్థానికులతో ఎమ్మెల్యే కెపి వివేకానంద్

జీడిమెట్ల, మే25 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ పరిధి వీనస్ రాక్ ప్లైంట్స్, దేవేందర్‌నగర్‌లలో గురువారం ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ప్రగతి యాత్రను చేపట్టి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దేవేందర్‌నగర్‌లో రూ.1.98కోట్లతో చేపడుతున్న నూతనంగా చేపడుతున్న హిందూ శ్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణ పనులను ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గం మెరుగైన వసతుల కల్పనే లక్ష్యంగా బీఆర్ఎస్ ముందుకు సాగుతోందన్నారు. అభివృద్ధి పనుల్లో నిధులకు కొరత లేకుండా ప్రజా అవసరాలకు ప్రాధాన్యమిస్తూ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సంజీవరావు, మాజీ కౌన్సిలర్ కిషన్‌రావు, బీఆర్ఎస్ నాయకులు బాల్‌రాజ్,పాక్స్ డైరెక్టర్ శ్రీనివాస్‌యాదవ్, హుస్సేన్, కమలాకర్, అబిద్, మసూద్, ఇబ్రహీం, తెలంగాణ సాయి, సాయిబాబా, మల్లేష్, సత్య నారాయణ, సంధ్యారెడ్డి, సుజాత, లక్ష్మణ్, వెంకటేష్, దిలీప్, నాగభూషణం పాల్గొన్నారు.

## కరాటే కల్యాణిని మా సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తున్నాం

భారత యాదవ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ది రమేష్ యాదవ్

హైదరాబాద్, మే 25,ప్రభాతవార్త: మా అసోసియేషన్ నుంచి కరాటే కళ్యాణి యాదవ్‌ను భారత యాదవ సమితి తీవ్రంగా ఖండిస్తుందని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ది రమేష్ యాదవ్ అన్నారు. ఈమేరకు గురువారం మీడియాకు ఒప్రకటన విడుదల చేశారు. శ్రీకృష్ణుడి వేషదారణలో ఎన్టీఆర్ విగ్రహం పెట్టొదన్నందుకు ఆమెను సస్పెండ్ చేయడం సమజసం కాదన్నారు. దీనిపై యాదవకులస్తుందరూ ఆమెకు అండగా ఉంటారని అసలు అది మా అసోసియేషన్‌హా లేక కమ్మ అసోసియేషన్ హా అని ప్రశ్నించారు. ఆమెపై సస్పెన్షన్ ఎత్తివేయకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారానికి కృషి: కార్పొరేటర్ జితేందర్‌నాథ్



బిటి రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్

అల్వాల్, మే 25 ప్రభాతవార్త: దశాబ్ధాలు కాలంగా పరిష్కారానికి నోచుకోలేని సమస్యలకు చెక్ పెడుతున్నామని మచ్చబొల్లారం కార్పొరేటర్ జితేందర్‌నాథ్ తెలిపారు. లప్పం ఫ్యాక్టరీ నుంచి సాయి బృందావన్ కాలనీ, గోపాల్ నగర్ నుంచి ఐస్ ఫ్యాక్టరీ వరకు 1.98 లక్షలు రూపాయలు వ్యయం కాగల సిసి, బిటి రోడ్డు నిర్మాణ పనులు గురువారం ప్రారంభం అయిన నేపథ్యంలో కార్పొరేటర్ పరిశీలించారు. ఓల్డ్ అల్వాల్ మరియు మచ్చబొల్లారం నుంచి కొంపల్లి రోడ్డును అనుసాందానం చేయడం ద్వారా వాహనదారుల సంవత్సరాలు కల సాకారం కానున్నదని జితేందర్‌నాథ్ తెలిపారు. ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఎనలేని కృషికి నిలువుటద్దంలా ఈ రోడ్డు నిలుస్తుందన్నారు. సుమారు 50 కాలనీలకు చెందిన ప్రజలకు ఈ రోడ్డు ద్వారా వెసులుబాటు కలుగుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఇ మహేష్ బిఆర్ఎస్ నేతలు శ్రీశైలం, శ్రావణ్, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతతో కూడిన అభివృద్ధికి ప్రాధాన్యత

కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్



సిసి రోడ్డు వద్ద కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్

అల్వాల్, మే 25 ప్రభాతవార్త: నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ అభివృద్ధి పనులను పూర్తి చేయించాల్సిన బాధ్యత అధికారులుపై ఉందని వెంకటాపురం కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్ తెలిపారు. గురువారం డివిజన్ పరిధిలోని పాత వెంకటాపురంలో 30లక్షలు వ్యయంతో నిర్మాణంలో ఉన్న సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ప్రజా ధనంతో చేపట్టే అభివృద్ధి కల కాలం మన్నే విధంగా ఉండాలన్నారు. కాంట్రాక్టర్ నియమ నిబంధనలు పాలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఇఇ కార్తీక్, ఎఇ అరుణ్ బిఆర్ఎస్ నేతలు లోకేష్, కుట్టి, మోసిన్, లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## వివాహిత అదృశ్యం



జీడిమెట్ల, మే 25 ప్రభాతవార్త: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వివాహిత అదృశ్యమైన సంఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెరుకుపల్లి కాలనీకి చెందని మిట్ల ఐశ్వర్య(24) భర్త రాజేష్‌తో కలిసి నివాసం ఉంటుంది. ఈనెల 22న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన ఐశ్వర్య అర్ధరాత్రి అవుతున్నా ఇ ంటికి తిరిగి రాలేదు. దీంతో కంగారు పడిన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల, బంధువులు, స్నేహితుల ఇంటి వద్ద విచారించినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం కుటుంబ సభ్యులు పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

### అద్భుత గాయకుడు బాలకామేశ్వరరావు

చిక్కడపల్లి, మే 25 ప్రభాతవార్త: అద్భుత గాయకుడు బాలకామేశ్వరరావు అని ప్రముఖ కవి, రసమయి సంస్థ అధినేత, బాలబంధు డాక్టర్ ఎం.కె.రాము అన్నారు. కల్పన కళానికేతన్ అధినేత దొంతి జంగయ్యగౌడ్ ఆధ్వర్యంలో ప్రముఖ గాయకుడు బాలకామేశ్వరరావుకు అభినందన సత్కార కార్యక్రమం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాదీక్షితులు కళావేదికలో జరిగింది.

## ఆధ్మాతికలోకంలో విహారింపజేసిన శాస్త్రీయ భక్తిభావన తరంగాలు



సన్మానం పొందిన కళాకారులతో ఓలేటి, ఉదయశంకర్

నాంపల్లి, మే 25 ప్రభాతవార్త : శ్రీలక్ష్మణాచారి మెమోరియల్ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్ ఆధ్వర్యంలో నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవి ద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామంది రంలో మూడురోజులపాటు సంస్థ 15వ వార్షికోత్సవ వేడుకలలో సంస్థ శిష్యులచే ప్రదర్శింపబడిన శాస్త్రీయ భక్తిభావన తరంగాలు విచ్చేసిన అశేష ప్రేక్షకులను భక్తిమార్గంలో పయనింపజేసి ఆధ్యాత్మిక లోకంలో విహారింపజేసి దిగ్విజయంగా ముగిసాయి. చివరిరోజు కార్యక్రమంలో భాగంగా సంస్థ విద్యార్థినీ విద్యార్థులు అనేక భక్తిరస కీర్తనలు, తిల్లానాలను వీనులవిందుగా గానం చేశారు. మహతిరాగవర్ణం, గమనశ్రమ తిల్లానా అంశాలు అశేష ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నాయి. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభాకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రముఖ సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం, గౌరవ అతిథులుగా ఆకాశవాణి హైదరాబాద్ కేంద్ర డైరెక్టర్ ఉదయశంకర్, ప్రముఖ నేపథ్య గాయకుడు (గానగంధర్వుడు డా. ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం కుమారుడు) ఎస్.ని.చరణ్, శశికళ, హిమబిందు పాల్గొని సంస్థ అధ్యాపకులు, విద్యార్థులు, శశికళ నేతృత్వంలో రూపొందిన సింధుభైరవి రాగవైభవం వీడియో సీడిని ఆవిష్కరించి శశికళ, హిమబిందులు చేస్తున్న అవిరళ కళాసేవను శ్లాఘించారు. చివరిగా వివిధ ప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేసి ఎంతగానో అభినందించి శుభాశీస్సులందజేశారు.

## ఎన్టీరామారావుకు భారతరత్న ప్రకటించాలి

టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా



మౌనదీక్ష చేస్తున్న టీడీపీ నేతలు

ధర్నాచౌక్, మే 25, ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్‌టి రామారావుగారి శతజయంతి సందర్భంగా ఆయనకు భారత రత్న పురస్కారం అందచేయాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ గురువారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ కార్యాలయం వద్ద నోటికి నల్ల గుడ్డలు కట్టుకుని మౌనదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ తెలుగు చలన చిత్ర పరిశ్రమకు ఎనలేని సేవలు అందించి, ముఖ్యమంత్రిగా, పేదలపక్షపాతిగా ఎన్నో సంక్షేమ పథకాలను అమలుచేసి, ప్రజల గుండెలలో నిలిచిపోయిన ఎన్టీఆర్‌కు భారత రత్న తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం రాజ్‌భవన్‌కు వెళ్లి ఈ అంశంపై వినతి పత్రం అందచేశారు. ఈ దీక్షా కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల కిషోర్, ప్రధాన కార్య దర్శి పి.బాలరాజ్‌గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శి రవీంద్రాచారి, జివిజి నాయుడు, వల్లారపు శ్రీనివాస్, శ్రీనివాస్‌నాయుడు, ఎం.కే.బోసు, మహిళా నాయకులు షకీలారెడ్డి, సి.హెచ్ విజయశ్రీ, భవాని, మచర్ల ప్రతిభ, కనకదుర్గ పాల్గొన్నారు.

## తలసానిపై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఒయులో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



ఒయులో రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మదగ్ధం చేస్తున్న ఒయు జేఏసీ, టీఎస్‌జేఏసీ నాయకులు

తార్నాక, మే 25 ప్రభాతవార్త: బీసీలైన యాదవ సమాజాన్ని, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను అవమానపరిచేవిదంగా టీపీసీసీ అధ్యక్షుడు అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడటం సరైన పద్ధతి కాదని ఓ.యూ జేఏసీ నాయకులు, టీజేఏసీ నాయకులు ఆరోపించారు. ఇటీవల మంత్రి తలసానిని అవమానపరుస్తూ రేవంత్‌రెడ్డి మాటలను నిరసిస్తూ గురువారం ఓ.యూలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మదగ్ధం చేశారు. అనంతరం ఓ.యూ ఆర్ట్స్ కాలేజ్ నుంచి ఎన్‌సీసీ గేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి ఇందిరాపార్క్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, జేఏసీ నాయకులు నక్క శ్రీశైలం యాదవ్, విద్యార్థి జేఏసీ వ్యవస్థాపకులు అశోక్ యాద్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బుద్దిచెబుతారన్నారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు యావత్ యాదవ సమాజాన్ని అవమానపరిచేవిదంగా ఉన్నాయన్నారు. తక్షణమే ఆయన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన అగ్రకుల అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. గతంలో ఓ.యూ విద్యార్థులను కించపరుస్తూ బీరు, బిర్యానికి పనిచేస్తారని రేవంత్‌రెడ్డి మాట్లాడి అవమానపరిచారని గుర్తు చేశారు. ఇప్పటికైనా తన వైకరిని రేవంత్‌రెడ్డి మార్చుకొని తలసానిపై చేసిన వ్యాఖ్యలను వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కడారి స్వామి, కావటి సతీష్ యాదవ్, చిరంజీవి యాదవ్, శేర్‌రమణ, రవీందర్, విధ్యార్థి నాయకులు రెమడాల శ్రీకాంత్, శరత్ యాదవ్, శ్రవణ్ యాదవ్, శివయాదవ్, గణేష్ యాదవ్, ప్రకాష్, మల్లేష్, వీరేష్, నాగారం ప్రశాంత్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## నూతన పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు నామకరణం చేయాలి

రాష్ట్రపతి ద్రౌపతిముర్మూచే ప్రారంభించాలి: టి.పద్మారావు డిమాండ్

సైఫాబాద్, మే 25 ప్రభాతవార్త: న్యూఢిల్లీలో నూతనంగా నిర్మించిన పార్లమెంట్ భవనానికి రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ పేరు నామకరణ చేయాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ప్రధానికి ఒక వినతి పత్రాన్ని పంపించడం జరిగిందని యువజన సంఘం జాతీయ ప్రధాన సలహాదారు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా కో-ఆర్డినేటర్ టి.పద్మారావు తెలిపారు. పార్లమెంట్ భవనం నిర్మాణం ప్రారంభమైననాటి నుంచి నేటి వరకు దేశంలోని ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టి వర్గాల ప్రజలు, వివిధ రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నప్పటికి కేంద్ర ప్రభుత్వం ముఖ్యంగా ప్రధాని ఇంతవరకు స్పందించకపోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పార్లమెంట్ భవనం అంటే కొత్త నిర్మించిన ఒక భవనం కాద ని భారత రాజ్యాంగానికి మూల స్తంభమని మన ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతిబింభమని, దేశంలోని 140 కోట్లమంది దేశ ప్రజల చెమట బింధువుల నుంచి ఏర్పడిన ప్రజల సొమ్ముతో నిర్మాణమైన ఆశాసౌదమని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి రాజ్యాంగ స్తంభమైన నూతన పార్లమెంట్ భవనా నికి అంబేద్కర్ పేరును నామకరణం చేయడం దేశానికి గర్వకారణమని ఇది చారిత్రక అవసరంగా తాము భావిస్తున్నామని, దేశ వ్యాప్తంగా ఈ డిమాండ్ మర్మోగుతున్నదని టి.పద్మారావు తెలిపారు. ఈ పార్లమెంట్ భవనాన్ని రాష్ట్రపతి, పదహారణాల గిరిజన ముద్దుబిడ్డ ద్రౌపతిముర్మూచే ప్రారం భింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం బిజెపి కార్యకర్తల కాదని నరేంద్రమోదీ గుర్తుంచుకోవాలని, ఈ భవనాన్ని దేశ ప్రజల సొమ్ముతో నిర్మాణం చేసిన విషయాన్ని మోదీ మరువరాదని, ఒంటెద్దు పోకడలకు పోతే చరిత్ర హీనులుగా మిగిలిపోతారని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు.

## 44 లక్షలతో తిలక్‌నగర్ పార్కులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పార్కులో పనులు ప్రారంభిస్తున్న కాలేరు వెంకటేష్, అమృత

హైదరాబాద్, మే 25 ప్రభాతవార్త: అంబర్‌పేట నియోజకవర్గంలోని నల్లకుంట డివిజన్‌లోగల తిలక్‌నగర్ పార్కులో 44 లక్షల రూపాయల ఖర్చుతో చేపట్టనున్న అభివృద్ధి, సుందరీకరణ పనులకు గురువారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, స్థానిక కార్పోరేటర్ అమృతతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం కెసిఆర్ దిశానిర్ధేశంలో నగరంలో పచ్చదనం పెంపుతోపాటుగా ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించమే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నామని చెప్పారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని అన్ని పార్కుల్లో అనేక రకాల మొక్కలు పెంచడం, సుందరీకరణతో పాటుగా ప్రజలకు సౌకర్యాంగా ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్‌లు, కొత్త బెంచీలు, త్రాగునీరు ఏర్పాట్లు, పెయింటింగ్, టైల్స్ ఏర్పాటు చేయడం, విద్యుత్ దీపాలు, పార్కు చుట్టూ ప్రహరీ, గేట్లతోపాటుగా చిన్నారులు ఆడుకోవడానికి అనేక క్రీడా సాధనాలు కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. తిలక్‌నగర్ పార్కు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాలేరు వెంకటేష్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తిలక్‌నగర్ ప్రజలు, సంబంధిత అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కొంపల్లి, మే25 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో రూ.21లక్షల వ్యయంతో దుర్గమ్మ గుడి నుంచి పోచమ్మ గుడి వరకు సీసీ రోడ్డు పనులను గురువారం చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సీసీ రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా త్వరగా పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీహరి, వైస్ చైర్మన్ గంగయ్యనాయక్, కౌన్సిలర్లు పూజారి వసంత, చింతల రవిందర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కంటోన్మెంట్‌ను జిహెచ్ఎంసిలో విలీనం చేయాలి: వికాస్‌మంచ్



కంటోన్మెంట్‌ను జిహెచ్ఎంసీలో విలీనం చేయాలని 5 వేల పోస్టు కార్డులను ప్రధాన మంత్రికి పంపిస్తున్న వికాస్ మంచ్ ప్రతినిధులు

కంటోన్మెంట్, మే 25 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాన్ని జిహెచ్ఎంసీలో విలీనం చేస్తేనే కంటోన్మెంట్ మరింత అభివృద్ధి చెందుతుందని వికాస్ మంచ్ అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం ఏబేలు, సంకి రవిందర్ బాబులు తెలిపారు. కంటోన్మెంట్‌ను జిహెచ్ఎంసీలో భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఆరు విడతల్లో నిర్వహించిన పోస్టు కార్డు ఉద్యమంలో చేపట్టిన 5 వేల పోస్టు కార్డులను గురువారం న్యూ ఢిల్లీలోని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడి కార్యాలయానికి, అబిడ్స్‌లోని హెడ్ పోస్టు ఆఫీస్ నుంచి పోస్టు కార్డులను పంపించినట్లు వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవిందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వికాస్ మంచ్ ప్రతినిధులు ప్రభుగుప్త, దామోదర్, పసి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా తీర్చుతున్నాం

### కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్

నాచారం, మే 25 ప్రభాతవార్త: ఎన్నికల హామిలను ఒక్కొక్కటిగా తీర్చుతున్నామని చిల్కానగర్ కార్పోరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ పేర్కొన్నారు. డివిజన్‌లోని సౌత్ ప్రశాంత్ నగర్‌లో గురువారం నూతనంగా వేస్తున్న సీసీ రోడ్డు పనులను అధికారులు, నాయకులతో కలిసి పర్యవేక్షిం చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గీతా ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించేలా చూడాలని సూచించారు. డివిజన్‌లోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ డిఈ మహేష్, డీఈ నిఖిల్ రెడ్డి, ఏఈ రాజ్‌కుమార్, నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కొండల్ రెడ్డి, కొక్కొండ జగన్, బింగి శ్రీనివాస్, మహమూద్, బాణాల రారాయణ రెడ్డి, ఎండి గౌస్, కొల్లూరి శ్యామ్, కాలనీ వాసులు రాములు, దశరథ, కృష్ణ, అర్జున్ పాల్గొన్నారు.

## ఒయు నూతన సిఐకి ఘన సన్మానం




ఒయూ నూతన ఇన్స్‌పెక్టర్ భాస్కర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న జింకల మల్లేష్

తార్నాక, మే 25 ప్రభాతవార్త: ఇటీవల నూతనంగా ఉస్మానియా యూనివర్సిటీ ఇన్స్‌పెక్టర్‌గా పదవిభాధ్యతలు స్వీకరించిన ఇన్స్‌పెక్టర్ బాస్కర్‌ను గురువారం మాణికేశ్వరీనగర్ బస్తీకి చెందిన బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకులు జింకల మల్లేష్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాకప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ గౌడ సంఘం అధ్యక్షుడు నాగేశ్‌గౌడ్, మల్కరి పద్మ ఇన్స్‌పెక్టర్‌ను సన్మానించారు.

## పీపుల్స్ మార్చ్ సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్, మే 25 ప్రభాతవార్త : కాంగ్రెస్ సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా గురువారం జడ్చర్లలో నిర్వహించిన కాంగ్రెస్ బహిరంగ సభకు కడ్తాల్ మండలం నుండి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుక్వెందర్‌సింగ్ తొలిసారిగా పాల్గొన్న సభకు డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ్మా, మాజీ జడ్పీటిసి శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఉత్సాహంగా బయలుదేరి వెళ్లారు.



ఇందిరాపార్కు ఎదుట జరిగిన ధర్నా కార్యక్రమానికి శ్రీనివాస్‌యాదవ్‌కు మద్దతును తెలియజేసిన బోయిన్‌పల్లి, కంటోన్మెంట్ యాదవ సోదరులు, కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, బోర్డు సభ్యులు

## గిరిజన విశ్వవిద్యాలయం ప్రారంభించకుండా కేంద్రం నిర్లక్ష్యం

### బిఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు శ్రీను నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీను నాయక్ తదితరులు

హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో గిరిజన విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించకుండా గిరిజనుల సమస్యల ను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తుందని బిఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు శ్రీను నాయక్ ఆరోపించారు. ఈమేరకు గురువారం సోమాజిగ డ్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2014 విభజన చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం రెండు తెలుగు రాష్ట్రాలకు గిరిజన విశ్వవిద్యాలయాన్ని కేటాయించాలని పేర్కొంటే ..పక్కరాష్ట్రమైన ఏపీలో ప్రారంభించి నాలుగేళ్లు అవుతున్నా తెలంగాణలో మాత్రం కనీస ప్రక్రియ ప్రారంభించలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం ములుగు జిల్లా రాకారం వద్ద 335 ఎకరాల స్థలం కేటాయించి దాదాపు ఏడు సంవత్సరాలు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఆస్థలంలో గిరిజన యూనివర్సిటీ నిర్మాణానికి సంబంధించిన పనులు ప్రారంభించలేదన్నారు. తెలంగాణ గిరిజన విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించాలని, తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం గిరిజనలకు కేటాయించిన 10శాతం రిజర్వేషన్లు రాజ్యాంగ సవరన చేసి ఆమోదించాలని ప్రధాని మోదికి పోస్టుకార్డుల పంపితే దానిపై ఎటువంటి స్పందన రాకపోవడం శోచనీయమన్నారు. గిరిజన యూనివర్సిటీపై స్పందించని బిజెపి పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపిలు రేపు రాబోయే ఎన్నికల సందర్భంగా ఓట్ల కోసం తండాలకు వస్తే అడ్డుకుంటని హెచ్చరించారు. ఈసమావేశంలో విద్యార్థి నాయకులు నరేష్ నాయక్, వంశీ నాయక్, సంగీతనాయక్, కిషన్ నాయక్, మోతీలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి ఇల్లు నిర్మించిన మేదర సంఘం

మొయినాబాద్, మే 25. ప్రభాతవార్త : మొయినాబాద్ మండలం చిలుకూరు గ్రామంలో పుట్ట మమతరాజు ఇల్లు గత నెలలో అగ్నిప్రమాదానికి ఆహుతై నిలువ నీడలేని దయనీయ సంఘటన చోటుచేసుకోగా వారిని మేదర కుల సంఘం ఆదుకుని ఆర్థిక సహాయం అందజేసి అదే స్థలంలో నూతన ఇంటిని నిర్మించి బుధవారం గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు ఇందూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఇందూరి చెన్నయ్య, కోశాధికారి యలమల యాదగిరి, ప్రచార కార్యదర్శి నోముల మహవీర్ ఆధ్వర్యంలో జరిగిన గృహ ప్రవేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర సంఘం అధ్యక్షులు జొ గ్రీగల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కోన రాజశేఖర్, కోశాధికారి పాతకోటి ఉమ, ప్రచార కార్యదర్శి ప్యారసాని రమాకాంత్ హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. గత నెల 5న ఆకస్మాత్తుగా విద్యుదాఘాతానికి గురై ఇల్లుతో పాటు ఇంట్లో ఉన్న ఆహార ధాన్యాలు, వంట సామాగ్రి, తినుబండారాలు, దుస్తులు, గృహపకరణ వస్తువులు, చాటలు, జల్లెండ్లు, బుట్టలు అల్లుకుని జీవనం సాగిస్తున్న కులవృత్తి పని సామాగ్రి మొత్తం నిమిషాల్లో కాలి బూడిదైన విషాద సంఘటన తెలుసుకుని సానుభూతి తెలిపి విచారం వ్యక్తం చేశారు. నివాసించేందుకు గూడు లేని దీన స్థితి ఏర్పడిన విషయాన్ని తెలుసుకున్న రంగారెడ్డి జిల్లా మేదర సంఘం ప్రతినిధులు సంఘటన స్థలికి చేరుకుని ఆపదకు గురైన పేద కుటుంబాన్ని పరామర్శించారు.

## అన్ని రాష్ట్రాల్లో సంచారజాతులకు ప్రత్యేక మంత్రిత్వ శాఖల ఏర్పాటు చేయాలి

### రాజస్తాన్ రాష్ట్ర మాజీ మంత్రి, వంశపారంపర్య రక్షణ, ప్రమోషన్ అకాడమి అధ్యక్షుడు రామ్‌సింగ్




ప్రసంగిస్తున్న రాజస్తాన్ రాష్ట్ర మాజీ మంత్రి, వంశపారంపర్య రక్షణ, ప్రమోషన్ అకాడమి అధ్యక్షుడు రామ్‌సింగ్

చిక్కడపల్లి, మే 25 ప్రభాతవార్త: కేంద్రంలో అధికారంలో ఉన్నబిజెపి ప్రభుత్వంతో పాటు అన్ని రాష్ట్రాల్లో సంచారజాతుల వారికి ప్రత్యేక మంత్రిత్వ శాఖలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని రాజస్తాన్ రాష్ట్ర మాజీ మంత్రి, వంశపారంపర్య రక్షణ, ప్రమోషన్ అకాడమి అధ్యక్షుడు రామ్‌సింగ్ అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ రాష్ట్ర డిఎన్‌టి, ఎన్‌టి సంఘం ఆధ్వర్యంలో నగరంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న డినోటిఫైడ్ ట్రైబ్స్(విముక్త జాతులు), నోమాడిక్ ట్రైబ్స్(సంచార జాతులు), సెమి నోమాడిక్ ట్రైబ్స్(అర్ధ సంచార జాతులు) కులాల జాతీయ సదస్సు గురువారం రెండవ రోజు సదస్సుకు జాతీయ డిఎన్‌టి కమిషన్ పూర్వ చైర్మన్ బాలకృష్ణ రేనకే అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామ్‌సింగ్ రావు మాట్లాడుతూ సంచారజాతుల ప్రజలకు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించి నిధులు విడుదల చేసి వారికి అందేలా చూడాలని, ఈ వర్గాలకు చెందిన యువతీ యువకులకు స్కిల్‌డెవలప్‌మెంట్ కార్యక్రమాలను నిర్వహించి వారికి గ్రాంట్లు మంజూరు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ ఇనుకొండ తిరుమలి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు గడచినా సంచారజాతుల వారు నేటికి అభివృద్ధికి దూరంగానే ఉన్నారని, వారికి కులధృవీకరణ పత్రాలు, రేషన్‌కార్డులు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలలో ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. సదస్సు నిర్వాహకులు రాష్ట్ర సంఘం అధ్యక్షుడు ఒంటెద్దు నరేందర్, ప్రధాన కార్యదర్శి తిపిరిశెట్టి శ్రీనివాస్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యువరాజ్, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చెన్నకేశవ్, అధ్యయన కమిటీ చైర్మన్ వెంకటనారాయణ, రాష్ట్ర సమన్వయకర్త వల్లపు సమ్మయ్య, అధికారప్రతినిధి వెన్నెల నాగరాజు, పన్నీరు నాగేశ్వరరావు, శ్రీనివాస్, సునీల్, వంశీ, బాలుతో పాటు రాజస్తాన్, మద్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, హర్యానా, తమిళనాడు, కర్ణాటక, పంజాబ్, ఢిల్లీ, బిహార్, చత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో ప్రతినిధులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

వికారాబాద్, మే 25, ప్రభాతవార్త : బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా మహిళా శిశు,దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ అధికారి లలితకుమారి అన్నారు. వికారాబాద్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల, గ్రామస్థాయి అధికారులతో బాల్య వివాహాల పైన అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీల ు బలోపేతం చేసి, ఈ కమిటీలు ప్రతి నెల ఆ గ్రామంలో బాల్య వివాహాల నిర్మూలనకై కృషి చేయాలన్నారు. గ్రామ సర్పంచ్ లు, గ్రామ పంచాయతీ కార్యదర్శి ,అంగన్వాడి టీచర్, స్థానిక వార్డ్ మెంబర్లు, పిల్లలు, ప్రజా ప్రతినిధుల ు కలుపుకొని బాల్య వివాహాల నిర్మూలనకు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఆడపిల్లకు 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే పెండ్లిలు చేయాలని ఆలా కాకుండా 18 సంవత్సరాల లోపు పిల్లలకు బాల్య వివాహాలు చేస్తే బాల్య వివాహ నిషేధ చట్టం – 2006 ప్రకారము కఠిన కారాగార శిక్ష విధింసబడుతుందని హెచ్చరించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గత సంవత్సరము 155 బాల్య వివాహాల ు అడ్డుకోవడం జరిగిందని, కొన్ని అనధికారికంగా జరిగిన బాల్య వివాహాలపైన ఎఫ్ఐఆర్ ఫైల్ చేయడం జరిగిందని తెలిపారు. 18 సంవత్సరాల నిండకుండానే పెళ్ళి చేస్తే ప్రభుత్వం ద్వారా అందించే కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాల ు కోల్పోతున్నారని, బాల్య వివాహాలు చేయడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ పైన భారం పడుతుందని అన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలపై తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తామని, అప్పటికీ మాట వినకపోతే కేసు నమోదు చేయించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయడం జరుగుతుందని ఇందులో అంగన్వాడి టీచర్ల కృషి చాలా ఉందని తెలిపారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు తలకిందులు కావడం, తల్లిదండ్రుల కష్టాల ు చూసి, వారి మాట కాదనలేక చిన్నారులు పెళ్లిపీటలపై కూర్చుంటున్న పరిస్థితి కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1098, 100 కు గాని సమాచారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ కళావతి, సూపరింటెండెంట్ చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇంట్లో చోరీకి పాల్పడిన అంతరాష్ట్ర దొంగ రిమాండ్

### 16.5 తులాల బంగారం, రూ.3,48,900లు నగదు స్వాధీనం.. నిందితునిపై 40 చోరీ కేసులు: డీసీపీ

ఘట్‌కేసర్, మే 25, ప్రభాతవార్త: తాళం వేసి ఉన్న ఇంట్లో పట్టపగలే బంగారం, నగదు అపహరించుకుపోయిన నిందితుని అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు మల్కాజ్‌గిరి ఎస్‌ఓటీ డీసీపీ రావుల గిరిధర్ తెలిపారు. ఘట్‌కేస్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చోరీ నిందితుని వివరాలు తెలియజేసి స్వాధీనం చేసుకున్న సొత్తును ప్రదర్శించారు. చోరీ కేసులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపుర ం జిల్లా కళ్యాణదుర్గం పట్టణం కొమ్మనచెట్ల వీధికి చెందిన పీట్ల గంగాధర్ అలియాస్ సాంబ (26) నిందితునిగా నిర్ధారించగా అతని వద్ద నుంచి 16.5 తులాల బంగారం, రూ.3,48,900లు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. గత నెల 7న ఘట్‌కేసర్ మున్సిపల్ ద్వారకానగర్‌కు చెందిన తాల్కా రాములు గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఉదయం 11:40 గంటలకు ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి చర్చికి వెళ్లారు. మధ్యాహ్నం 3:20 గంటలకు తిరిగి ఇంటికి వచ్చే సరికి తలుపు తెరచి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలో సామాన్లు చిందరవందరగా పడేసి ఉన్నాయి. గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న 21 తులాల బంగారు అభరణాలు, రూ.5 లక్షల నగదును అపహరించుకుపోయారని బాధితుడు ఘట్‌కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేపట్టిన ఘట్‌కేసర్ పోలీసులు చోరీకి పాల్పడిన అగంతకుని కోసం గాలించారు. ఈమేరకు గురువారం ఉదయం 6 గంటలకు ఘట్‌కేసర్‌లోని డిల్లీ పబ్లిక్ స్కూల్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనాల విషయం బయటపడిందని తెలిపారు. ఏప్రిల్ 7వ తేదీ ఘట్‌కేసర్ ద్వారకానగర్‌లో తాల్కా రాములు ఇంట్లో ఇనుపరాడ్‌తో తలుపు హుక్కు తొలగించగా బంగారం, నగదు ఎత్తుకెళ్లినట్లు నిందితుని ద్వారా వివరాలు సేకరించారు. గంగాధర్ పాతనేరస్తుడు కాగా అతనిపై కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో 40కి పైగా దొంగతనం కేసులు ఉన్నాయని డీసీపీ వివరించారు. తల్లిదండ్రుల మాట వినకుండా 2011 సంవత్సరం నుంచి ఇంటి నుంచి బయటకు వచ్చి జులాయిగా తిరిగేవాడని, పేకాట, బెట్టింగులలో పాల్గొనేవాడని తెలిపారు. అతని చెడు అలవాట్లు, కోరికలు తీర్చుకునేందుకు దొంగతనాలకు పాల్పడేవాడని, పగటి పూట తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని చోరీలు చేయగా అనేక సార్లు పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపించారని పేర్కొన్నారు. అపహరించిన నగదుతో పేకాట, బెట్టింగులు చేసేవాడని, బంగారు అభరణాలను మురికి సంచులతో పెట్టి తెలిసిన ఇండ్లలో భద్రపరిచేవాడని తెలిపారు. నిదితుడు ఆర్టీసీ బస్సులు, ఆటోలలో ప్రయాణించేవాడని కాలనీల్లో కాలినడకన తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి చోరీలు చేశాడని తెలిపారు. నిందితున్ని వద్ద నుంచి 16.5 తులాల బంగారు అభరణాలు, రూ.3,48,900లు నగదు, చోరీకి ఉపయోగించిన ఇనుపరాడ్, చేతి గ్లౌజ్‌లను స్వాధీనం చేసుకున్నామని డీసీపీ పేర్కొన్నారు. ఈకేసులో ఘట్‌కేసర్ పోలీసులు, మల్కాజ్‌గిరి ఎస్‌ఓటీ బృందం సంయుక్తంగా పనిచేసి నిందితున్ని పట్టుకుని చోరీ సొత్తు స్వాధీనం చేసుకోగా వారి డీసీపీ అభినందించి క్రైమ్ సిబ్బందికి నగదు బహుమతులను అందజేశారు. ఈసమావేశంలో మల్కాజ్‌గిరి ఏసీపీ పి.నరేశ్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ వి.అశోక్‌రెడ్డి, అదనపు ఇన్‌స్పెక్టర్ ఈ.జంగయ్య, ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ ఎ.రాములు, ఎస్ఓటి ఎస్ఐ జి.రఘురాం, డిఎస్ఐ జె.అశోక్‌కుమార్, ఎస్ఓటి ఎఎస్ఐ మల్లేశ్, క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

## అసైన్డ్ భూములపై ల్యాండ్ దారులకే సంపూర్ణ హక్కులు కల్పించాలి

### తెలంగాణ అసైన్డ్ ల్యాండ్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్



సమావేశంలో మాట్లాడుతున్న శివయ్య, రాములు తదితరులు

హైదరాబాద్, మే 25,ప్రభాతవార్త: 1977 పివోటి చట్టంను పూర్తిగా రద్దు చేసి అసైన్డ్ ల్యాండ్ దారులకే భూములపై సంపూర్ణ హక్కులు కల్పించాలని తెలంగాణ అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్‌వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్షులు ఎర్రోళ్ల శివయ్య, ప్రధాన కార్యదర్శి బింగి రాములు మాట్లాడారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భూమికోసం,భుక్తికోసం హైదరాబాద్ రాష్ట్ర ప్రజల దాస్య విముక్తికోసం రావినారాయనరెడినడ ఆధ్వర్యంలో ఆనాడు తెలంగాణ రైతాంగ పోరాటం పెద్దఎత్తున జరిగిందన్నారు. ఆపోరాట ఫలితంగా భారతదేశంలో ఏరాష్ట్రంలో పేద ప్రజలకి పంచలేనన్ని అసైన్డ్ భూములను మన తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 65లక్షల ఎకరాలు పంచారని అందులో తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 24లక్షల అసైన్డ్ భూములు భూమిలేని నిరుపేదలకు ,ఎస్సీ,ఎస్టీ ,బిసి మైనార్టీలకు ఎకరం నుంచి మూడెకరాలవరకు పంచడం జరిగిందన్నారు. అయితే ఆనాడు హైదరాబాద్ విస్తీర్ణం ఉంటే 10కిమీ ఉంటే నేడు 80 నుంచి వంద కిలోమీటర్ల విస్తీర్ణంకు పెరిగిందన్నారు. అయితే అసౌన్డ్ భూములల్లో వ్యవసాయం చేసుకంటూ ,ఇళ్లు కట్టుకుని జీవిస్తున్న ప్రజలకు దశాబ్దాలుగా పూర్తిస్థాయి హక్కులు లేక రాజకీయ నాయకుల కబ్జాల నుంచి తప్పించుకోవడానికి నిత్యం అష్టకష్టాలు పడాల్సి వస్తుందన్నారు. కావున పేద ప్రజలకు ఇచ్చిన అసైన్డ్ భూములకు పూర్తి హక్కులను కల్పిస్తే కోటి మందికంటే ఎక్కువ మంది మధ్యతరగతి వారు ఆర్థికంగా బలపడాతరన్నారు. అందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుని పూర్తిహక్కులు కల్పిస్తూ చట్టం చేయాలని కోరారు.

## రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధి కోసం నిరంతరం కృషి



రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను సన్మానిస్తున్న భవానీనగర్ కాలనీ వాసులు

మైలార్‌దేవ్‌పల్లి, మే 25 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ నియోజకవర్గ ం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ భవానీ కాలనీలో హైటెన్షన్ విద్యుత్ స్థంభాలు వేసి కాలనీ నుంచి విద్యుత్ సరఫరా తీసుకెళ్లారు. వర్షం కురిసిన సమయంలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడటంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని భవానీనగర్ కాలనీ వాసులు భయపడుతుండేవారు. ఈ విషయాన్ని కాలనీ వాసులు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. ఇండ్లపై హైటెన్షన్ విద్యుత్ తీగలు లేకుండ ఉండేలా విద్యుత్ శాఖ అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సమీక్షించారు. కాగా ముఖ్యమంత్రి కేసిఆర్ దృష్టికి తీసుకెళ్లి 43 లక్షల రూపాయల నిధులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మంజూరు చేయించారు. సమస్య పరిష్కారం కావటంతో గురువారం భవానీనగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను కలిసి సనా ్మనించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధి కోసం అహర్నిశలు పాటు పడుతున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## డ్రైవర్ నిర్లక్ష్యంతో నిండు ప్రాణం బలి

నిజాంపేట్, మే 25 ప్రభాతవార్త: బస్సు రిపేర్ పూర్తి కాకుండానే శ్రీ కార్తిక్ కేతూరి ట్రావెల్స్ డ్రైవర్ బస్సును నడిపి ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకున్న సంఘటన గురువారం బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లంపేటకు చెందిన రాఘవులు బాచుపల్లిలోని సాయి పార్కింగ్‌లో ఒక షెడ్డును అద్దెకు తీసుకొని బస్సులు రిపేర్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం 8:30గంటల సమయంలో శ్రీ సాయి కార్తిక్ కేతూరి ట్రావెల్స్ అశోక లేలాండ్ బస్ నెంబర్ ఏపీ39యుజె7412 డ్రైవర్ శివకుమార్ డీజిల్ ట్యాంక్ లీకవుతోందని, రిపేర్ చేయాలని రాఘవులు షెడ్డు తీసుకువచ్చాడు. బస్సు డ్రైవర్ శివకుమార్ బయటకు వెళ్ళి టిఫిన్ చేసి వచ్చేలోగా రాఘవులు బస్సు రిపేర్ చేసి తన పని తాను చేసుకుంటున్నాడు. అయితే బస్సు కింద ఉన్న గుర్తుతెలియని వ్యక్తిని గమనించని బస్సు డ్రైవర్ ఉదయం 10:45 నిమిషాల సమయంలో నిర్లక్ష్యంగా బస్సు నడపడంతో గుర్తు తెలియని వ్యక్తి తల నుజ్జు నుజ్జై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ విషయం గమనించిన రాఘవులు నిర్లక్ష్యంగా బస్సు నడిపి వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్ శివకుమార్‌పై తగిన చర్యలు తీసుకోవాలని బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## నేడు సాలార్‌జంగ్ మ్యూజియంలో ఖేలో భారత్ జీతో భాగ్యనగర్ బహుమతుల ప్రదానం



సాలార్‌జంగ్ మ్యూజియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న బిజెపి నాయకులు

చార్మినార్, మే 25 ప్రభాతవార్త : సాలార్‌జంగ్ మ్యూజియంలో ఈ నెల 26వ తేదీ శు క్రవారం సాయంత్రం నాలుగు గంటలకు ఖేలో భారత్ జీతో భాగ్యనగర్ బహుమతుల ప్రధానోత్సవం కార్యక్రమం జరుగుతుందని మాజీ రాష్ట్ర బిజెపి మైనార్టీ మోర్చ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తెలిపారు. గోల్కొండ జిల్లా బిజెపి అధ్యక్షులు వి.పాండు యాదవ్,సీనియర్ బిజెపి నాయకులు పాపారావు,కార్పొరేటర్ ఓంప్రకాష్ మాజీ రాష్ట్ర మైనార్టీ మోర్చ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీలు కలిసి గురువారం సాయంత్రం కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను సాలార్‌జంగ్ మ్యూజియంలో పరిశీలించారు. ఈ సందర్భంగా మీర్ ఫిరాస్‌త్ అలీ బాక్రీ మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో, క్రికెట్, వాలీబాల్,అథ్లెటి క్స్ తదితర క్రీడలలో గెలు పొందిన విజేతలకు బహుమతుల ప్రధానం చేయనున్నారని తెలిపారు. జాతీయ ఓబిసి మోర్చ అధ్యక్షులు,ఎంపి డాక్టర్ కె.లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందర్ రాజన్,కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటున్నారని ఆయన తెలియజేశారు.

## హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖేందర్‌సింగ్‌కు ఘన స్వాగతం

షాద్‌నగర్, హైదరాబాద్, మే 25, (ప్రభాతవార్త) : తెలంగాణ సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర గురువారంతో 850 కిలోమీటర్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జడ్చలలో భారీ స్థాయిలో బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఈ సభలో ముఖ్యఅతిథిగా హాజరయ్యేందుకు హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖేందర్ సింగ్ వస్తుండటంతో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో కలిసి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ శంషాబాద్ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సుఖేందర్ సింగ్‌ను వీర్లపల్లి శంకర్ శాలువ, పూలబోకేతో ఘనంగా సన్మానించారు.

## కల్వకుర్తిలో అదృశ్యమైన యువతి.. కొంపల్లిలో ప్రత్యక్షం



అదృశ్యమైన యువతి షన్నును కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు

పేట్‌బషీరాబాద్, మే25 ప్రభాతవార్త: కల్వకుర్తిలో 3రోజుల క్రితం అదృశ్యమైన యువతి ఆచూకీ గురువారం కొంపల్లిలో పేట్‌బషీరాబాద్ పోలీసులకు లభించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజీవ్ గాంధీనగర్ కల్వకుర్తికి చెందిన షన్ను(16)అనే యువతి తన ఇంటి నుంచి 3రోజుల క్రితం అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇంటి వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సమాచారం పేట్‌బషీరాబాద్ పోలీసులకు సమాచారం అందించగా వారు తెలిపిన వివరాల ఆధారంగా తప్పిపోయిన షన్నును గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC
నిట్ నెం.11/EE/GHMC/DIV-21/2023-24, తేది: 24.05.2023
టెండర్ ప్రకటన (ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా)
no నెం11/EE/GHMC/DIV-21/2023-24, (ఐటమ్ నం.01) తేది: 24.05.2023 ప్రకారం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా (01) పని యొక్క అంచనా ధర: రూ.39.00 లక్షలతో టెండర్లు పిలవబడుతున్నవి, బిడ్స్ విక్రయం వెబ్‌సైట్ ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ పై 26.05.2023 సా.4.00 గం. నుండి తెరువబడి ఉన్నాయి, బిడ్స్ దాఖలుకు చివరి తేది: 29.05.2023 సా.4.00 గం. వరకు, దాఖలు సమయం ఒక గంట ముందుగా బిడ్స్ విక్రయం ముగింపు చేయబడుతుంది. తదుపరి వివరాలు వెబ్‌సైట్ https://tender.telangana.gov.in పైన చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చందానగర్ డివిజన్-21, SLP జోన్ : GHMC
DIPR.No.2283-PP/CL/Advt/1/2023-24, తేది: 25.05.2023

వార్త VAARTHA CLASSIFIEDS
CLASSIFIEDS

CHANGE OF NAME
★ I, N LAXMI DEVI S/o (N.ANJENEYALU) residing at (NFC NAGAR ,GHATKSAR ,HYDEADBAD ), have Changed my Name to (DANDE LAXMI DEVI) as per affidavit dated (27 MAR 2023) Sworn Before Notary R.N.V ANIL KUAMR.
(Ro.No.8490)

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

# సరూర్‌నగర్ స్టేడియంలో సిఎం కప్-2023 క్రీడలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

**ఎల్.బి.నగర్, మే 25 ప్రభాతవార్త :** తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి కప్-2023 ఈ నెల 22 నుండి 24 తేదీ వరకు జిల్లా స్థాయిలో క్రీడలను సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ పొందిన (1236) ఉత్తమ క్రీడాకారులు జిల్లా స్థాయిపోటీలో పాల్గొన్నారు. మొదటి విజేత వాలీబాల్ పురుషుల విభాగంలో ఫరూఖ్‌నగర్ మండలం, రెండవ విజేత వాలీబాల్ పురుషుల విభాగంలో గండిపేటమండలం, మొదటి విజేత వాలీబాల్ మహిళా విభాగంలో తలకొండపల్లి మండలం, రెండవ విజేత వాలీబాల్ మహిళా విభాగంలో యాచారం మండలం, మొదటి విజేత కబడ్డీ పురుషుల విభాగంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రెండవ విజేత కబడ్డీ పురుషుల విభాగంలో సరూర్‌నగర్ మండలం, మొదటివిజేత కబడ్డీ మహిళా విభాగంలో సరూర్‌నగర్ మండలం, రెండవ విజేత కబడ్డీ మహిళా విభాగంలో బాలాపూర్ మండలం, మొదటి విజేత ఖోఖో పురుషుల విభాగంలో సరూర్‌నగర్ మండలం, రెండవ విజేత ఖోఖో పురుషుల విభాగంలో హయత్‌నగర్ మండలం, మొదటి విజేత ఖోఖో మహిళా విభాగంలో హయత్‌నగర్‌మండలం, రెండవ విజేత ఖో-ఖో మహిళా విభాగంలో యాచారం మండలం, మొదటి విజేత ఫుట్‌బాల్ పురుషుల విభాగంలో సరూర్ నగర్ మండలం, రెండవ విజేత ఫుట్‌బాల్ పురుషుల విభాగంలో యాచారం మండలం, మొదటి విజేత బాస్కెట్ బాల్ పురుషుల విభాగంలో సరూర్‌నగర్ మండలం, రెండవ విజేత బాస్కెట్ బాల్ పురుషుల విభాగంలో హయత్‌నగర్ మండలం, జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన (238) క్రీడాకారులను (18) క్రీడ అంశాలలో వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, స్విమ్మింగ్", ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, ఆర్చరీ, హాకీ, జిమ్నాస్టిక్స్, షూటింగ్ క్రీడలో ఎంపిక చేసిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో ఈ నెల 28 నుండి 31 వరకు జరిగే పోటీలకు పంపించడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పలువురు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

# మాసబ్‌చెరువును కాపాడండి : అఖిలపక్ష నాయకులు

## మాసబ్ చెరువు ఆక్రమణపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలి

## నిద్రాహారాలు మాని రాత్రిపగలు కాపలా కాస్తున్న అఖిలపక్ష నాయకులు

## ఇంత చేసిన లారీలతో మట్టి నింపుతూ కబ్జాకు పాల్పడుతున్న భూ మాయగాళ్లు



మట్టి డంపింగ్ చేసి చెరువును రెండుగా చీల్చుతున్న వైనం..

**తుర్కయంజాల్, మే 25, ప్రభాతవార్త :** రాష్ట్రంలో భూ బకాసురుల దాహానికి హద్దే లేకుండా పోతుంది. చెరువులను కబ్జా చేస్తున్నారు. తాజాగా రంగారెడ్డి జిల్లాలోనే అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని తుర్కయంజాల్ మున్సిపాలిటీ మాసాబ్ చెరువును కబ్జా చేస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. స్థానికులు సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అక్రమార్కులు భూ బకాసురులు ఎక్కడ పడితే అక్కడ వాలిపోతున్నారు. ఈ మధ్య కాలంలో చెరువులను కూడా కబ్జా చేసిన సందర్భాలు చాలానే ఉన్నాయి. తాజాగా తుర్కయంజాల్‌మున్సిపాలిటీలోని మాసాబ్‌చెరువును ఒకరిని చూసి మరొకరు కబ్జా చేస్తున్నారు. అధికారులకు తెలియజేస్తే నిమ్మకు నీరెత్తినట్టుగా చూసి ఉండిపోతున్నారు. ఈ తతంగం వెనుక ఎవరున్నారు... ఎవరు కబ్జా చేపిస్తున్నారనేది... త్వరలోనే బయటపడేటట్టు చేస్తామని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేస్తున్నారు. వందల ఏళ్లుగా పరిసర ప్రాంత ప్రజలకు వ్యవసాయం, మంచినీళ్లు అందించిన్న చెరువు.. నేడు రియల్టర్ల కబ్జాల కబంధ హస్తాలకింద పడి తూర్కయంజాల్ మాసబ్ చెరువు కనుమరుగయ్యే స్థితికి దుస్థితికి చేరుకుంది. ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యంతో 500 ఎకరాల్లో విస్తరించి ఉన్న మసాబ్ చెరువు రియల్టర్ల భూ దాహానికి ఇప్పటికే దాదాపు వంద ఎకరాలు కబ్జాకు గురైందని చెబుతు న్న సంబంధిత అధికారులు.. మిగిలివున్న చెరువును కాపాడ డంలో పూర్తిగా విఫలమవుతున్నారని స్థానికులు తీవ్రంగా మండిపడుతున్నారు. గడిచిన నెల రోజులుగా చెరువును రెండు భాగాలుగా విభజించిన భూ మాయగాళ్లు ఒక పక్కన సాగర్‌హైవేకు అనుకోని 11 ఎకరాలకు ఫెన్సింగ్ వేసి నీటితో నిండు కుండలా ఉన్న చెరువును రాత్రికి రాత్రి వందల లారీల మట్టితో నింపుతూ కబ్జాకు పాల్పడుతున్నారు.. అడ్డు కుంటున్న స్థానికులపై ప్రయివేట్ గుండాలను పెట్టి వారిపై దాడులు చేయడా నికి సైతం వెనుకాడడం లేదు.. ఇదే విషయమై స్థానిక అన్ని పార్టీల నాయ కులు కొంతమంది తుర్కయంజాల్ కౌన్సిలర్లు, ప్రకృతి ప్రేమికులు కలిసి అఖిలపక్షంగా ఏర్పడి చెరువు కబ్జాను ప్రతి రోజు రాత్రిల్లు కాపలాగ ఉంటు న్నారు. అయినా కబ్జాదారులు ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ చెరువును నలు వైపులనుండి మట్టితో పెద్ద పెద్ద బండ రాళ్లతో పూడ్చివేస్తు చెరువు రెండుగా చీల్చి వేస్తున్నారు. ఈ విషయమై అఖిల పక్ష నేతలు.. జిల్లా జాయింట్ కలెక్టర్, ఇరిగేషన్ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే, ఎంపిలకు కలిసి వినతి పత్రాలు, ఫిర్యాదు చేసినప్పటికి.. కేవలం కోర్టు కేసు సాకు చూపిస్తున్న అధికారులు అందిన కాడికి దండుకొని కేసులో ఏముందో పరిశీలిచకుండానే చేతులు దులుపుంటున్నారని అఖిల పక్ష నాయకులు తీవ్రంగా మండి పడు తున్నారు. గడిచిన 15 రోజులుగా చెరువు పరిరక్షణకోసం పాటుపడుతుంటే అధికారులు కన్నెత్తి చూడకపోవడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటి కైనా మసాబ్ చెరువును కబ్జాదారుల కోరలనుండి కాపాడాలని ప్రజలు వేడు కుంటున్నారు. లేదంటే అఖిలపక్ష నాయకులు సాగర్ రహదారిపై నిరాహార దీక్ష చేస్తామని డిమాండ్ చేస్తున్నారు.

# మీర్‌పేట్ కార్పొరేషన్ అభివృద్ధి ఘనత సబితమ్మదే: కామేష్‌రెడ్డి

**సరూర్‌నగర్, మే 25 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి ఘనత రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిదేనని మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి అన్నారు. కార్పొరేషన్‌లోని ప్రాంతాలను హెచ్ఎండిఎ, జిహెచ్ఎంసి, స్పెషల్ నాలా ఫండ్, ఇరిగేషన్ నిధులు, ఆర్ఎంబి ఫండ్, ఎల్ఆర్ఎస్ నిధులు, దేవాదాయశాఖ ప్రత్యేకనిధులతో వరద పారించి అభివృద్ధి చేస్తున్నందుకు హర్షం వ్యక్తం చేస్తూ గురువారం ఆయన మంత్రిని కలిసి పుష్పగుచ్ఛా నిచ్చి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కామేష్‌రెడ్డి మాట్లాడుతూ సబితారెడ్డి చొరవతో కార్పొరేషన్‌లో అభివృద్ధి దాదాపు 90 శాతం పూర్తయ్యిందని తెలిపారు. ఈ మేరకు ఆయన కార్పొరేషన్ ప్రజల తరపున మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# సాధ్యమైనంత మేర త్వరగా సమస్యలను పరిష్కరిస్తా : కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

**హయత్‌నగర్, మే 25 ప్రభాతవార్త:** సమస్యల తీవ్రతను బట్టి నిధులను కేటాయించి వాటిపరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని వెంకటాద్రినగర్, తిరుమలకాలనీల్లో ఆయన సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ, తాగు నీటి ఇబ్బందులున్నాయని కాలనీవాసులు కార్పొరేటర్‌కు వివరించారు. దీనిపై ఆయన స్పందిస్తూ సాధ్యమయినంత త్వరగా సమస్యలను పరిష్కరిం చి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.

# కులవృత్తుల వారి అభివృద్ధి కోసం ఆర్థిక సహాయం పట్ల హర్షం

**ఎల్.బి.నగర్, మే 25 ప్రభాతవార్త :** కులవృత్తులపై ఆధారపడిన వారి అభివృద్ధి కోసం లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించేందుకు బీసీ సబ్‌కమిటీని ఏర్పాటు చేసేందుకు కాబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి కెసిఆర్ నిర్ణయం తీసుకోవడంపై తెలంగాణ రాష్ట్ర చేతి వృత్తి సంఘాల రాష్ట్ర సబ్ కమిటి సభ్యులు బొద్దుపల్లి కృష్ణ హర్షం వ్యక్తం చేసారు. కులవృత్తులపై ఆధారపడి జీవించే వారి సంఖ్య లక్షలకుపైగా ఉన్నారని, కావలసినంత పెట్టుబడులులేక, కుల వృత్తిని వదులుకోలేక, కొత్త మార్గం పట్టలేక లక్షలాది మంది జీవచ్ఛవాలుగా కాలం వెళ్లదీస్తున్నారని రూ.5లక్షలు ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేసారు. దేశానికి వెన్నెముకైనా రైతులు, కులవృత్తి పనివారు ఒకరి మీద ఒకరు అదార పడి జీవిస్తుంటారని ప్రభుత్వం ఈ విషయం గుర్తించి కులగణన సర్వే చేపట్టి జనాభా ప్రాతిపదికన కుల వృత్తి దారులకు సామాజిక రక్షణ, సంక్షేమం అభివృద్ధికి నిధులు కేటాయించాలని కృష్ణ కోరారు.

# డ్రైనేజీ సమస్య పరిష్కరించండి : చింతల

**ఎల్.బి.నగర్, మే 25 ప్రభాతవార్త :** డ్రైనేజీ సమస్యను పరిష్కరించే విధంగా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ అధికారులకు సూచించారు. నాగోల్ డివిజన్లోని సాయినగర్ రోడ్ నెంబర్- 6లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉండటంతో కార్పొరేటర్ సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జలమండలి అధికారులు సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జల మండలి డిజిఎం మాధవి, మేనేజర్ అర్చన వెంటనే స్పందించి డ్రైనేజీ సమస్య వేంటనే పరిష్కరించాలనీ ఆదేశించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని సాయి నగర్ రోడ్ డ్రైనేజీ సమస్యను పరిష్కరించడంలో భాగంగా వర్షపునీరు నిలవకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

# మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీని సద్వినియోగం చేసుకోవాలి : ఆనంద్‌రెడ్డి




అడ్మిషన్ల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పెద్దబావి ఆనంద్‌రెడ్డి

**సరూర్‌నగర్, మే 25 ప్రభాతవార్త:** రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి చొరవతో బడంగ్‌పేట్‌లో ఏర్పాటైన మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్హులైన విద్యార్థులు అడ్మిషన్లు తీసుకొని కాలేజీని సద్వినియోగం చేసుకోవాలని కాలేజీ అభివృద్ధి కమిటీ సభ్యుడు పెద్దబావి ఆనంద్‌రెడ్డి పిలుపు నిచ్చారు. బడంగ్‌పేట్ దావూద్‌ఖాన్‌గూడలోని మహిళా పాలిటెక్నిక్ కాలేజీలో ఉన్న ఈ కాలేజీకి సంబంధించి 2023-24 విద్యా సంవత్సరానికి గాను అడి్మషన్ల బ్రోచర్‌ను గురువారం ఆయన కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాధికతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వసతులు, అనుభవజ్ఞులైన బోధనా సిబ్బంది ఉన్న ఈ ప్రభుత్వ డిగ్రీ కాలేజీని విద్యార్థులు ఆదరించి ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, లెక్చరర్లు డాక్టర్ ఛందోజీ రావు, డాక్టర్ కరీముల్లా, డాక్టర్ విజయ ప్రసాద్, నరసింహరాజు, సిబ్బంది ఆనంద్, కృష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్‌కు బిజెపి నేతల సన్మానం




ఇన్‌స్పెక్టర్‌ను సన్మానిస్తున్న మీర్‌పేట్ బిజెపి కార్పొరేటర్లు, నాయకులు

**సరూర్‌నగర్, మే 25 ప్రభాతవార్త:** మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా ఇన్‌స్పెక్టర్‌గా పదవీబాధ్యతలు చేపట్టిన కిరణ్‌కుమార్‌ను గురువారం మీర్‌పేట్ కార్పొరేషన్‌కు చెందిన పలువురు బిజెపి కార్పొరేటర్లు, నాయకులు సన్మానించారు. కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ, స్థానిక కార్పొరేటర్ పసునూరి బిక్షపతిచారిల ఆధ్వర్యంలో ఇన్స్‌పెక్టర్‌ను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో తమ వంతు సహకరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి కోడూరు సోమేశ్వర్, కార్పొరేటర్లు భీమ్‌రాజ్, కీసర హరినాథ్‌రెడ్డి, బచ్చనమోని పద్మనర్సింహయాదవ్‌లతోపాటు గోలి శ్రీనివాస్ రెడ్డి, శ్యాంసుందర్, వేణుగోపాల్‌రెడ్డి, విక్కీ సాగర్, మల్లేస్, శివకుమార్ చారి, గోపాల్, వెంకటేశ్, అరుణ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వం : మంత్రి తలసాని



ఎమ్మెల్యే బలాలను అభినందిస్తున్న యోగేష్ జైన్ తదితరులు

**మలక్‌పేట, మే 25 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. మలక్‌పేటలో సింగి పరివార్ ప్రతినిధులు సురేందర్‌కుమార్, రాజేంద్ర కుమార్, మహేంద్రకుమార్, మనోహర్‌కుమార్, విజయరాజ్, యోగేష్‌జైన్, గిరిరాజ్, నితీష్‌ల ఆధ్వర్యంలో నిర్మించిన బంబ్ సింగి భవన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, మలక్‌పేట, ఎల్‌బినగర్ ఎమ్మెల్యేలు అహ్మద్ బలాల, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బిఆర్ఎస్ నాయకుడు తలసాని సాయికిరణ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శ్రమన్ సంఘ్ యువ చార్స్ మహేందర్ రుషిజీ, రోచ్ వ్యాఖ్య పండిత్ రత్న జ్ఞాన్‌ముని మహరాజ్, వక్త కపిల్‌ముని మహరాజ్, శృతిముని మహరాజ్, సద్విశ్రీ కంచన కవర్‌జీ, ఇందు బాలాజీలు భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట జైన్ సంఘం అధ్యక్షుడు సురేష్‌గాడియా, ఉపాధ్యక్షులు ప్రేమ్‌చందజీ కొటారి, జ్ఞాన్‌చంద్ కొచట, పుక్‌రాజ్‌జీ, తతేడ్, ప్రధాన కార్యదర్శి దిలీప్‌గాడియా, సంయుక్త కార్యదర్శి మనీష్, కోశాధికారి ప్రేమ్‌కొటారి తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి : మేయర్ పారిజాత నర్సింహ్మారెడ్డి



స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలిస్తున్న మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, మే 25 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 22, 28 డివిజన్లలో గురువారం మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పర్యటించారు. స్పెషల్ సానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా ఆమె ఆయా డివిజన్లలో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్ళతో పాటు ఇళ్ళ పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్‌పెక్టర్ వి.యాదగిరి, కార్పొరేటర్లు లిక్కి మమతా కృష్ణారెడ్డి, సూర్ణగంటి అర్జున్, సానిటేషన్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

# వైదేహినగర్, సాయి సేవాస్థలి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



ట్రాలీ స్పీకర్ సెట్‌ను అందజేస్తున్న ఓజోన్ హాస్పిటల్స్ బృందం

**వనస్థలిపురం, మే 25 ప్రభాతవార్త :** వైదేహినగర్ నార్త్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, సాయిస్థలి సేవాట్రస్టు వారి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సాయిబాబామందిరం సెల్లార్‌లో ఓజోన్ హాస్పిటల్స్ మేనేజర్ గణేష్ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో షుగర్ పరీక్షలు, బిపి చెకింగ్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సాయిరమ్యతో ఉచిత సేవలను నిర్వహించారు. జిహెచ్ఎంసి, జలమండలి సిబ్బంది, కాలనీవాసులు, ఆలయ పూజారులతో సహా ఉచిత వైద్య సేవలను 71 మంది వినియోగించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వైదేహినగర్ నార్త్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు చేసే సేవలను గుర్తించి ఓజోన్ హాస్పిటల్స్ తరపున మేనేజర్ గణేష్ అధ్యక్షుడు పోగుల రాంబాబుకు అసోసియేషన్‌సభ్యులు, కాలనీవాసులసమక్షంలో ట్రాలీ స్పీకర్ సెట్‌ను బహుమతిగా అందజేసారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రాజేందర్‌రెడ్డి, వేణుగోపాల్, నాగరాజ్, రామ్మోహన్, కృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి, రవీందర్, రాములు పాల్గొన్నారు.

# అన్ని సంపదల్లో గొప్పది విజ్ఞానం.. దానిని పంచితేనే సార్థకత: శ్రీనివాసరావు



ప్రసంగిస్తున్న సామాజిక కార్యకర్త శ్రీనివాసరావు

**సరూర్‌నగర్, మే 25 ప్రభాతవార్త:** అన్ని సంపదల కంటే గొప్పది విజ్ఞానమనీ అట్టి విజ్ఞానాన్ని పది మందికి పంచితేనే దానికి సార్థకత కలుగుతుందని సామాజిక కార్యకర్త, సిల్వర్ డ్రాప్ విద్యా సంస్థల చైర్మన్ జె.శ్రీనివాసరావు అన్నారు. శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి మంగళ శాసనములతో నిర్వహిస్తున్న వికాస తరంగిణి మీర్‌పేట్ శాఖ ఆధ్వర్యంలో జిల్లెలగూడలోని సిల్వర్ డ్రాప్స్ హైస్కూల్‌లో గత 10రోజులుగా ప్రజ్ఞ పేరిట విద్యార్థులకోసం నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విజ్ఞానం అనే సంపదను ఎవ్వరూ కొల్లగొట్టలేరని అట్టి సంపదను పది మందికి పంచితే సమాజహితం చేసినట్లవుతుందని తెలిపారు. ముఖ్యంగా గురువులకు విజ్ఞానం పంచడంలోనే ఆనందం ఉంటుందని ఆయన వెల్లడించారు. మానవుని వికృత చేష్టల వల్లే ప్రకృతి వైపరీత్యాలు పెరుగుతున్నాయనీ మనం ఎలా ఉపయోగించుకుంటే అలా ఉపయోగపడే ప్రకృతిని మానవ కళ్యాణానికి వినియోగించాలని ఆయన సూచించారు. మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని శ్రీనివాసరావు పేర్కొన్నారు. కాగా ప్రజ్ఞ ముగింపు సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ ప్రవచనకర్త వేముల రాజేశ్వరరావు, కడారి రవీందర్‌రెడ్డి, వికాసతరంగిణి జోనల్‌ఇంఛార్జి అహల్య, విద్యుత్ శాఖ రిటైర్డ్ అధికారి రమణ, అప్పం రఘువీర్, శ్రీమన్నారాయణ, వికాస తరంగిణి సభ్యులు రూపవతి, ఉష, సువర్ణ, ఉషారాణి, సుగుణమ్మ, రాధ, ప్రసన్న, ఉమ, రాధిక, లీల, అరుణ, రాధిక, సుమిత్ర, పలువురు విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# వీరన్నగుట్టను గొప్ప దైవక్షేత్రంగా తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



తహశీల్దార్ సంధ్యారాణికి వివరాలు చెబుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**హయత్‌నగర్, మే 25 ప్రభాతవార్త:** వీరన్నగుట్టను అధ్యాత్మిక ప్రాంతంగా తీర్చిదిద్దడంతోపాటు పరిసరాలను అత్యంతసుందరంగా మార్చడానికి 13.75 కోట్ల రూపాయలను మంజూరు చేసినట్లు ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన హయత్‌నగర్ తహశీల్దార్ సంధ్యారాణి, హెచ్ఎండీఏ ఈఈ ముంతాజ్, స్థానిక నాయకులతో కలిసి మన్సూరాబాద్ డివిజన్ పరిధి హయత్‌నగర్ ప్రాంతంలోని వీరన్నగుట్టను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వీరన్నగుట్టలోని శివాలయం చుట్టూ 6.5ఎకరాల స్థలంలో దివ్యక్షేత్రాన్ని, రాక్‌గార్డెన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీరన్నగుట్ట సుందరీకరణలో భాగంగా మరో 3.5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని సైతం కేటాయించాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు వివరించారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా లక్ష మంది వరకు దివ్యక్షేత్రానికి దర్శనార్థం హాజరవుతారని వారందరి సౌకర్యార్థం అభివృద్ధి, సుందరీకరణ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. ఎత్తుపల్లాల కారణంగా కొండమీదకు వాహనాలు వెళ్లడానికి వీలుకావడం లేదన్నారు. అధునాతన సీసీరోడ్డుతో పాటు మెట్లమార్గాన్ని కూడా ఆధునీకరించనున్నట్లు పేర్కొన్నారు. భక్తుల వాహనాలకు అవసరమైన పార్కింగ్ సదుపాయాన్ని కూడా కల్పిస్తామన్నారు. వీరన్నగుట్ట చుట్టూ ప్రహారీ, ఆహ్లాదకరమైన పార్కు, యోగా కేంద్రం, గోశాల, చిన్నపిల్లలకు క్రీడాపరికరాలను సమకూర్చనున్నట్లు వివరించారు. ముందుగా ప్రహారీ చేపట్టి అనంతరం ఇతర పనులను పూర్తిచేసి వీరన్నగుట్టను గొప్ప దైవక్షేత్రంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ కమిటీ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, నాయకులు జగదీష్‌యాదవ్, జక్కిడి రఘువీర్‌రెడ్డి, ఆనంద్ యాదవ్ పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ ద్వారానే దేశ ప్రగతి : హోంమంత్రి మహమూద్ అలీ



హోంమంత్రిని కలిసిన బిఆర్ఎస్ ఖాజా పాష బృందం..

**కుషాయిగూడ, మే 25 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ పార్టీ ద్వారానే దేశ ప్రగతి జరుగుతుందని రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ వెల్లడించారు. కాప్రా సర్కిల్ చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కాజా పాషా బృందం రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రపంచ దేశాలు గర్వించే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్నారు అన్నారు. భవిష్యత్తులో దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించి దేశ పాలనకు శ్రీకారం చుట్టేది బిఆర్ఎస్ పార్టీ నేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆజం అలీ,మహమ్మద్ అన్వర్ ,బద్రుద్దీన్,బాగ్దాద్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోనే రైతుల సేవలో ముందు వరుసలో భాగ్యనగర్ సొసైటీ : చైర్మన్ నర్సింహారెడ్డి



వరి విత్తనాల విక్రయాలను ప్రారంభిస్తున్న చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, మే 25 ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లాలోనే రైతుల సేవలో భాగ్యనగర్ సొసైటీ ముందు వరుసలో ఉంటుందని సొసైటీ చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. నాదర్‌గుల్‌లోని సొసైటీ కార్యాలయంలో గురువారం బిపిటి వరి విత్తన విక్రయాలను చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సేవ చేయాలనే లక్ష్యంతోనే సొసైటీలోకి రావడం జరిగిందని తెలిపారు.ప్రతి సీజన్‌లో రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలను సొసైటీలో అందుబాటులో ఉంచుతున్నామని ఆయన వెల్లడించారు. బిపిటి వరి విత్తనాలు కావాల్సిన వారు సొసైటీలో సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పెత్తుల్ల పుల్లారెడ్డి, తిరుపతి గిరిరాజు, సొసైటీ మేనేజర్ పిండి నారాయణరెడ్డి, రైతులు నర్సింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి : రాధాకృష్ణ



విద్యార్థులను అభినందిస్తున్న నారాయణ దిల్‌సుక్‌నగర్ కోర్ డీన్ రాధాకృష్ణ

**మలక్‌పేట, మే 25 ప్రభాతవార్త :** విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని నారాయణ కళాశాల దిల్‌సుక్‌నగర్ కోర్ డీన్ రాధాకృష్ణ పేర్కొన్నారు. గురువారం తెలంగాణ ఎంసెట్ ఇంజనీరింగ్ ఫలితాల్లో దిల్‌సుక్‌నగర్ నారాయణ డే స్కాలర్ విద్యార్థులు విజయ దుంధుభి మ్రోగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో తమ దిల్‌సుక్‌నగర్ డే డివిజన్‌నుండి నాగసాయి రాష్ట్ర స్థాయిలో 147వ ర్యాంకు సాధించడని, అదేవిధంగా 500ల ర్యాంకులోపు 5 మంది విద్యార్థులు, 1000లోపు 18 మంది, 5000లోపు 115 మంది, 10వేల లోపు 221 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని తెలిపారు. దిల్‌సుక్‌నగర్ నారాయణ డే డివిజన్ విద్యార్థులు ఎంసెట్ ఇంజనీరింగ్ విభాగంలో అధిక ర్యాంకులు సాధించారని అన్నారు. ఘన విజయం సాధించిన విద్యార్థులను రాధాకృష్ణ, డీన్ అమరేందర్, డిజిఎం రాజు తదితరులు పుష్పగుచ్చాలను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ జగదీష్, దామోదర్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, రవీందర్, శేషుకుమార్ పాల్గొన్నారు.